మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - సోమవారం 19 అక్టోబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 285 ‖ పేజీలు: 8+4 ‖ వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

ఆమె వయస్సు 30.. ఆయన వయస్సు 75

వారి ప్రేమ వివాహానికి నిశ్చితార్థం



2

దుర్గా దేవి అలంకరణతో భక్తులకు దర్శనం



6



8వ రోజు

దుర్గే దుర్గతి నాశని

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైనున్న జగజ్జనని దుర్గమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అష్టమి నాడు దుర్గాదేవిగా భక్తులను సాక్షాత్కారిస్తుంది జగదంబ. దుర్గముడనే రాక్షసుడిని సంహరించినందున దుర్గ అని పేరొచ్చింది. దుర్గతులను నివారించే మహాశక్తి స్వరూపంగా భక్తులు దుర్గాదేవిని కొలుస్తారు.



కూటమి వర్సెస్ వైసీపీ

రణరంగంగా మారిన పురపోరు



అమరావతి, మనం ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత క్షేత్రస్థాయిలో ఉనికి చాటుకోవడానికి వైసీపీ సర్వశక్తులు ఒడ్డుతుండగా, క్లీన్ స్వీప్ లక్ష్యంతో అధికార కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అయితే ఈ నామినేషన్ల పర్వం ప్రశాంతంగా సాగలేదు. పలు జిల్లాల్లో ఇరు పార్టీల మధ్య ఘర్షణలు, దాడులతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ముఖ్యంగా పుంగనూరు, రాయచోటి, కడప, తిరుపతి వంటి ప్రాంతాలలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. వైసీపీ లోక్సభ పక్షనేత మిథున్రెడ్డి కాన్వాయ్పై, అలాగే మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్రెడ్డి కార్యాలయంపై టీడీపీ శ్రేణులు దాడులకు దిగాయని నివేదించింది. వైసీపీ ఆరోపణలు: తమ అభ్యర్థులను భయాందోళనకు గురిచేస్తూ, నామినేషన్ పత్రాలను లాక్కొంటూ ఎక్కడా స్వేచ్ఛగా నామినేషన్లు వేయనివ్వడం లేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వం మరియు రాష్ట్ర ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నామినేషన్ల గడువును పొడిగించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ను ఏపీ హైకోర్టు కొట్టివేయడంతో విపక్షానికి చట్టపరంగా ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల సంఘం చర్యలు: విపక్షాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై

> ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. అక్టోబర్ 18 సాయంత్రం 3 గంటలతో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ గడువు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత జరుగుతున్నమొదటి ప్రతిష్టాత్మక పోరు కావడంతో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మరియు విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైయస్ఆర్సీపీ) మధ్య సింహాసనం కోసం హోరాహోరీ పోరు నెలకుంది. నామినేషన్ల చివరి రోజున ఇరువర్గాల అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో రిటర్నింగ్ అధికారుల (ఆర్ఓ) కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి.

...మిగతా 2లో

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి



విజయవాడ, మనంప్రత్యేకప్రతినిధి: కలియుగ వైకుంఠమైన తిరుమల దివ్య క్షేత్రంలో శ్రీవారి వైభవ ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత అట్టహాసంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కోటి సూర్యుల తేజస్సుతో భాసిల్లుతూ శ్రీ మలయప్పస్వామివారు సూర్యప్రభ వాహనంపై అధిరోహించి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. శ్రీవారిని కళ్లారా

...మిగతా 2లో


అమ్మ ఆశీస్సులతో రాష్ట్ర సుభిక్షంగా ఉండాలి

కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్న మంత్రి కొలుసు పార్థసారథి

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో దర్శన ఏర్పాట్లు

భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మజ్జిగ, పాలు తదితర వసతుల కల్పన

సమాచార, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి



విజయవాడ, 18 అక్టోబర్ (మనం ప్రతినిధి): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాని సమాచార, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం శ్రీ దుర్గా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మవారిని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


...మిగతా 2లో

భక్తిభావంతో ఐశ్వర్య దీప పూజ

వేలాదిమంది భక్తులతో శ్రీపీఠంలో భగవతి సేవ

అమ్మవారి అనుగ్రహం కోసం దుర్గాష్టమి ప్రత్యేక సామూహిక పూజలు





కాకినాడ రూరల్, అక్టోబర్, 18: దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీపీఠంలో నిర్వహించిన మహాశక్తి యాగం నాలుగో సంవత్సరం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భగవతి సేవ, ఐశ్వర్య దీప పూజ భక్తిశ్రద్ధల తో జరిగాయి. పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామివారి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని ఐశ్వర్యం, ఆరోగ్యం, జ్ఞానం, సుఖసంతోషాలను ప్రసాదించే జగన్మాతగా భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, పూజల్లో పాల్గొనడం విశేషంగా నిలిచింది. కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న 'మహాశక్తి యాగం' కార్యక్రమం ఆదివారం కూడా ఎంతో ఘనం గా జరిగింది. శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారు శ్రీ దుర్గాదేవి దేవిగా దర్శనం ఇచ్చారు. భగవతి సేవలో భాగంగా ఐశ్వర్య దీప పూజ కోసం వచ్చిన భక్తులకు దీపాలు, తైలం, వత్తులు, కుంకుమ, అక్షతలు అందజేశారు. ముందుగా రసీదులు ఉన్నవారికి ఐశ్వర్య దీపాలను అందించే

...మిగతా 2లో



యువత భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసా

సాంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించే దాండియా వేడుకల్లో పాల్గొన్న మంత్రి టీజీ భరత్

కర్నూలు, అక్టోబర్ 18 (మనం న్యూస్): కర్నూలు నగరంలోని కిసాన్ ఘాట్ వద్ద ఉన్న ఫన్ అండ్ ఫుడ్లో స్టార్టన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దాండియా ఈవెంట్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి దాండియా ఆడి సందడి చేశారు.ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. సాంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొనడం మంచి పరిణామమని పేర్కొన్నారు. యువత విద్య, క్రీడలు, సాంకేతికత, వ్యాపార రంగాలతో పాటు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు.యువతలోని ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు

...మిగతా 2లో

తప్పు చేశాం

సీఈసీ మద్దతిచ్చేది లేకుండే

- ఎస్ఈసీ కూడా చోద్యం చూసింది
- బాబుకు ధైర్యం లేదు
- రాష్ట్రంలో ఎన్నికల పేరిట ప్రజాస్వామ్యం ఖూనీ
- కూటమి ప్రభుత్వంపై గవర్నర్కు వైయస్ జగన్ ఫిర్యాదు

విజయవాడ,అక్టోబర్18(మనం ప్రతినిధి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తిగా అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా సాగుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి ఆక్షేపించారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల పర్వంలో చోటు చేసుకుంటున్న అంతులేని అక్రమాలపై లోక్భవన్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ను కలిసిన వైయస్ జగన్

...మిగతా 2లో



తొలి విడత నామినేషన్ ముగిసింది

28న పోలింగ్, 30న ఫలితాలు

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: పురపాలక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఘట్టం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారంతో పూర్తయింది. చివరి రోజైన ఆదివారం మధ్యాహ్నం 3.00 గంటల సమయానికి రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద వరుసలో ఉన్న అభ్యర్థులందరి పత్రాలను అధికారులు స్వీకరించారు. అంతిమ గడువు ముగియడంతో అన్ని ప్రధాన పార్టీల మద్దతుదారులు, స్వతంత్ర అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు సమర్పించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్

...మిగతా 2లో

తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చిన గోదావరి బోర్డు

2

అనుమతులు పొందిన ప్రాజెక్టులపై పునఃసమీక్షించే అధికారం లేదని స్పష్టీకరణ

- 30న జరగనున్న బోర్డు సమావేశం
- నిధులు, టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుపై చర్చ

విదేశీ సంస్థలకు రహస్య సమాచారం..

పోలీసుల అదుపులో ఆర్మీ అధికారి భార్య

ఢిల్లీ, అక్టోబర్ 18: విదేశీ గూఢచర్య సంస్థలకు దేశ రక్షణకు సంబంధించిన సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలతో.. ఆర్మీ అధికారి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశ భద్రతపై ప్రత్యక్ష ప్రభావం చూపే సున్నితమైన పత్రాలు, ఫోటోలు, ఎలక్ట్రానిక్ డేటాను రహస్యంగా సేకరించడం, బదిలీ చేయడం వంటి విషయాల్లో విదేశీ ఏజెంట్లకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం అందినట్లు తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. పరిశోధన సంబంధిత కార్యకలాపాలను ఆర్మీ అధికారి పర్యవేక్షించేవారు. ఆయన భార్యకు కొన్ని నెలల క్రితం.. సోషల్ మీడియాలో పలువురు వ్యక్తులు పరిచయం అయ్యారు. వారు తమను తాము విద్యావేత్తలుగా చెప్పుకున్నారు. వ్యాసాలను ప్రచురిస్తామని నమ్మించి రక్షణ అంశాలపై వ్యాసాలు రాయించారు. ఎటువంటి అనుమానం రాకుండా ఉండేందుకు మొదట పర్యావరణం, భౌగోళిక రాజకీయాలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రాయిస్తూ..

...మిగతా 2లో

భూతాపంతో పెరగనున్న ఏసీ కాలుష్యం

050 నాటికి 0.03-0.07 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల వెల్లడి

పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను పెంచడం ఒక పరిష్కారం

రూఫ్టాప్ సోలార్ విద్యుతు వినియోగాన్ని పెంచాలె



హైదరాబాద్, అక్టోబర్ 18: 'భూతాపంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇంధన పొదుపు సామర్థ్యంతో కూడిన ఏసీల వినియోగంపై దృష్టి పెట్టాలి. పునరుత్పాదక ఇంధన వ్యవస్థలైన రూఫ్టాప్ సోలార్, పవన విద్యుత్తు వ్యవస్థలను గణనీయమైన వేగంతో పెంచాల్సిన అవసరముంది' అని ఆక్స్ఫర్డ్ ఎకనామిక్స్ నివేదిక అభిప్రాయపడింది. భవన లోపలి ఉష్ణోగ్రతలు తగ్గించేలా బిల్డింగ్ కోడ్ అమలు చేయాలని సూచించింది. 'ఏసీలు-భూతాపం పెరగకుండా చర్యలు' అనే అంశంపై నివేదిక విడుదల చేసింది.

ఏసీతో కరెంట్ వినియోగం 36 శాతం పెరుగుదల..

ఒక ఇంట్లో ఏసీ ఉంటే.. ఆ ఇంటి విద్యుత్తు వినియోగం

...మిగతా 2లో

ఫ్రాన్స్లో ఆందోళనలకు

టుక్డే..టుక్డే వలస వాదులే కారణం

ఆ దేశం పరిస్థితులపైనా ట్రంప్ అదే వైఖరి

న్యూయార్క్, అక్టోబర్ 18: ఫ్రాన్స్ లో కొనసాగుతున్న ఆందోళనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హింసాత్మక ఘటనలతో ఆ దేశం భగ్గుమంటోందన్నారు. పూర్తిగా భిన్నమైన ప్రపంచం నుంచి వచ్చి, ద్వేషంతో ఉన్న వలసదారులే వీటికి కారణమని ఆరోపించారు. ఒకప్పుడు గొప్పగా వెలుగొందిన దేశాన్ని ముక్కలు ముక్కలుగా చేస్తున్నారని మండిపడ్డారు. మరీ ఆలస్యం కాకముందే దేశ సరిహద్దులను మూసివేసి నియంత్రణలోకి తెచ్చుకోవాలని ఆ దేశ నాయకత్వానికి సూచించారు. ఈ

...మిగతా 2లో

మరోసారి భగ్గుమన్న ఫ్రాన్స్!

భక్తిభావంతో ఐశ్వర్య దీప పూజ

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియలో కొంత ఆలస్యం ఏర్పడటంతో స్వామివారు స్వయంగా పంపిణీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులందరికీ దీపాలు అందేలా పలు కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని నిర్వాహకులకు సూచించారు.ఎవరూ ఆందోళన చెందవద్దని, రసీదులు ఉన్న ప్రతి ఒక్కరికీ దీపాలు అందే వరకు కార్యక్రమాన్ని ప్రారంభించబోమని స్వామివారు స్పష్టం చేశారు. అనంతరం భక్తులకు దీపంలో వత్తులు వేసుకోవడం, తైలం పోసుకోవడం, కుంకుమ, అక్షతలను విడివిడిగా ఉంచుకోవడం వంటి సూచనలు ఇచ్చారు. పూజలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా పాల్గొనాలని కోరారు.

సంపదతో పాటు జ్ఞానం, అనుగ్రహం ప్రసాదించాలని ప్రార్థన

అమ్మవారిని 'వర్షిణి'గా అభివర్ణించిన స్వామివారు..వర్షం అంటే కేవలం జలధార మాత్రమే కాదని, దైవానుగ్రహం, సంపద, జ్ఞానం కూడా వర్షంలా కురవాలని కోరుకోవాలని వివరించారు. ప్రజలకు మేలు చేసే వర్షం కావాలే తప్ప, ప్రాణనష్టం, ఆస్తినష్టం కలిగించే అతివృష్టి వద్దని పేర్కొన్నారు. అలాగే సంపద కూడా మనిషిని అభివృద్ధి చేసే విధంగా ఉండాలే తప్ప, కష్టాల్లోకి నెట్టే విధంగా ఉండకూడదని సందేశమిచ్చారు. శ్రీపీఠం పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ, సామర్లకోట, పిఠాపురం ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ, కార్యక్రమానికి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొనగలిగారని స్వామివారు పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చినట్లు తెలిపారు. అమ్మవారిపై విశ్వాసంతో, దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు.

చండీ సప్తశతి స్తోత్రాలతో ఐశ్వర్య దీపారాధన

ఐశ్వర్య దీప పూజలో భాగంగా చండీ సప్తశతిలోని కవచం, అర్గళం, కీలకం, స్తోత్ర చతుష్టయం, సిద్ధ కుంజికా స్తోత్రం తదితర పారాయణాలను నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణంతో అమ్మవారిని ధ్యానిస్తూ భక్తులు కుంకుమార్చన, దీపారాధనలో పాల్గొన్నారు. దీపాన్ని దైవ స్వరూపంగా భావించి, దాని కాంతిలో దర్శనమిచ్చే అమ్మవారి రూపం భక్తుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోవాలనే సంకల్పంతో ఈ పూజను నిర్వహించినట్లు స్వామివారు వివరించారు. పూజలో తొందరపడకుండా, మనస్సును ప్రశాంతంగా ఉంచి అమ్మవారిపై ఏకాగ్రతతో ధ్యానం చేయాలని సూచించారు. కవచ స్తోత్రం భక్తులకు రక్షణ భావాన్ని కలిగిస్తుందని, అర్గళం, కీలకం, సిద్ధ కుంజికా స్తోత్రాల ద్వారా అమ్మవారి అనుగ్రహాన్ని ప్రార్థించే అవకాశం లభిస్తుందని వివరించారు. సిద్ధ కుంజికా స్తోత్రాన్ని 'మాస్టర్ కీ'తో పోల్చుతూ, ఆధ్యాత్మిక సాధనలో దాని ప్రాధాన్యాన్ని భక్తులకు తెలియజేశారు.

'అమ్మవారి అనుగ్రహమే జీవితానికి ఆధారం'

మనిషి జీవితంలో కోరికలు వయస్సు, కుటుంబ పరిస్థితులను బట్టి మారుతుంటాయని స్వామివారు పేర్కొన్నారు. యువత ఉద్యోగాలు, జీవితంలో స్థిరత్వం కోరుకుంటారని, కుటుంబస్థులు తమ పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యం, సంతోషం కోసం ప్రార్థిస్తారని వివరించారు. వయస్సు పెరిగేకొద్దీ ఆరోగ్యంగా, ఇతరులపై ఆధారపడకుండా జీవిస్తూ అమ్మవారి సేవలో కాలం గడపాలని కోరుకుంటారని తెలిపారు.అయితే అన్ని కోరికలకంటే అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకోవడమే ముఖ్యమని, అమ్మవారిపై విశ్వాసం ఉంటే జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తి లభిస్తుందని సందేశమిచ్చారు. భక్తి అనేది కేవలం దర్శనం చేసుకుని వెళ్లిపోవడం మాత్రమే కాదని, ఏకాగ్రత, శ్రద్ధ, క్రమశిక్షణతో కూడిన సాధన అని పేర్కొన్నారు. మహాశక్తి యాగం నాలుగో సంవత్సరంలోకి ప్రవేశించిందని, ప్రతి ఏడాది భక్తులు ఆధ్యాత్మికంగా ఒక్కో మెట్టు ఎదగాలన్నదే తమ సంకల్పమని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించనున్న మహాయాగానికి ప్రస్తుత కార్యక్రమాలు పునాదిగా నిలుస్తాయని వివరించారు.



ఉద్యోగం సాధించిన భక్తురాలి అనుభవం

ఈ సందర్భంగా ఏలూరు నుంచి వచ్చిన నీలిమ అనే భక్తురాలు తన కుటుంబానికి అమ్మవారి పూజలతో ముడిపడిన అనుభవాలను వివరించారు. తాను, తన సోదరుడు ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. మహాశక్తి యాగంలో మొదటి సంవత్సరం నుంచి పాల్గొంటూ వచ్చామని, 2025 ఆగస్టు 1న వెలువడిన ఫలితాల్లో తామిద్దరం ఒకేసారి కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యామని పేర్కొన్నారు. గతంలో సరస్వతీ పూజ, దుర్గాష్టమి పూజల్లో పాల్గొన్నామని, ఈ ఏడాది కూడా అనేక ఇబ్బందులను అధిగమించి అమ్మవారి పూజకు వచ్చినట్లు తెలిపారు. తాను తొలిసారిగా కుట్టించుకున్న పోలీసు యూనిఫామ్ను అమ్మవారి పాదాల వద్ద ఉంచాలని కోరుకుంటున్నానని చెప్పారు. తన కుటుంబానికి కలిగిన అనుభవాలను ఇతరులకు వివరించడం వల్ల వారు కూడా పూజలో పాల్గొనేందుకు వచ్చారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తు, విద్యాభివృద్ధి కోసం తల్లిదండ్రులు సరస్వతీ పూజ చేయించాలని ఆమె సూచించారు.

సాయంత్రం నవశక్తి హోమం

దుర్గాష్టమి సందర్భంగా ఐశ్వర్య దీప పూజలో పాల్గొన్న భక్తులకు అల్పాహారం, సాయంత్రం జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేవారికి మహాప్రసాదం అందించారు. భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నవశక్తి హోమం నిర్వహించారు. రాహుకాల సమయంలో అమ్మవారికి నిమ్మకాయలతో దీపారాధన, నువ్వుల నూనెతో ప్రత్యేక పూజలు నిర్వహించి రాహు, కేతు గ్రహ దోషాల నుంచి విముక్తి కలగాలని ప్రార్థించారు.

సహస్ర కలశాభిషేకంలో పాల్గొనేవారికి ఐశ్వర్య దీపం

ఐశ్వర్య దీపాలను పొందలేకపోయిన భక్తులకు మరో అవకాశం కల్పించనున్నట్లు స్వామివారు ప్రకటించారు. ఎల్లుండి నిర్వహించనున్న సహస్ర కలశాభిషేకంలో పాల్గొనే భక్తులకు వారి గోత్రనామాలతో పూజలు నిర్వహించి, అనంతరం ఐశ్వర్య దీపాలను అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1,008 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రత్యక్షంగా హాజరు కాలేని భక్తులు కూడా తమ గోత్రనామాలను నమోదు చేసుకుంటే, వారి పేరిట పూజలు నిర్వహించి ఐశ్వర్య దీపాన్ని పోస్టు ద్వారా పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అదే రోజు సాయంత్రం అమ్మవారికి, ఈశ్వరుడికి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివాహం కావాల్సిన పిల్లలున్న కుటుంబాలు, దాంపత్య జీవితంలో మనస్పర్థలు ఎదుర్కొంటున్న దంపతులు ప్రత్యేక సంకల్పంతో ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని వివరించారు.

అసూయ, ద్వేషాలకు దూరంగా ఉండాలి

భక్తులు ఇతరులకు చెడు జరగాలని కోరుకోకూడదని, తమకు ఇతరుల వల్ల ఎలాంటి కీడు కలగకుండా కాపాడాలని మాత్రమే అమ్మవారిని ప్రార్థించాలని స్వామివారు సూచించారు. అసూయ, ద్వేషం, ఈర్ష్య వంటి భావాలకు దూరంగా ఉండి సానుకూల ఆలోచనలతో జీవించాలని పిలుపునిచ్చారు. మహాశక్తి యాగంలో భాగంగా నిర్వహిస్తున్న పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన, ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. దుర్గాష్టమి, నవమి, దశమి పర్వదినాల్లోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు కొనసాగనున్నట్లు తెలిపారు.

టుక్ డే టుక్ డే వలస వాదులే కారణం

(మొదటి పేజీ తరువాయి)

మేరకు ట్రూత్ సోషల్లో పోస్టు పెట్టారు.

మరోసారి భగ్గుమన్నఫ్రాన్స్!

ఫ్రాన్స్ అల్లర్లపై ట్రంప్ స్పందించడం ఇదే తొలిసారి కాదు. ఇటీవల ఓ సందర్భంగా ఆందోళనలను ప్రస్తావిస్తూ.. వ్యంగ్యంగా మాట్లాడారు. అదో అందమైన దేశమని, అక్కడ ఎలాంటి ఆందోళనలు, ఉద్యమాలు ఉండవని ఎద్దేవా చేశారు. విప్లవాలకు ఆదో మంచి ప్రదేశమని, అక్కడకు వెళ్లి ఆందోళనల్లో పాల్గొందామని హాస్యంగా చెప్పారు. మరోవైపు, ఆ దేశంలో అశాంతికి వలసలే కారణమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా పరోక్షంగా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

మరోసారి భగ్గుమన్నఫ్రాన్స్!

ప్యారిస్, అక్టోబర్ 18: ఫ్రాన్స్ విద్యారంగంలో సంస్కరణలు కోరుతూ కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు రోజు రోజుకు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ క్రమంలో అనేక నగరాల్లో మరోసారి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పారిస్ సిటీ సెంటర్కు సమీపంలో ఆందోళనకారులు ఓ కారుతో పాటు దుకాణానికి నిప్పుపెట్టారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఫ్రాన్స్ లో మూడో అతిపెద్ద నగరమైన లియోన్లోనూ అల్లర్లు చెలరేగాయి. ఓ టూరిస్టు ఆఫీస్కు నిప్పుపెట్టారు. మార్సెయిల్ నగరంలోనూ ఓ పోలీస్ స్టేషన్తోపాటు పలు దుకాణాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఈ ఆందోళనలకు కార్మిక సంఘాలు కూడా మద్దతిచ్చినట్లు సమాచారం. హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్న పోలీసులు.. దేశవ్యాప్తంగా 166 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు, ఉపాధ్యాయ సిబ్బంది కొరత, విద్యారంగానికి నిధుల లేమి, పాఠశాల భవనాల దుస్థితికి వ్యతిరేకంగా ఫ్రాన్స్ లో కొన్ని రోజులుగా ఆందోళనలు జరుగుతున్నాయి. వీటితోపాటు యూనివర్సిటీల్లో ప్రవేశాల వ్యవస్థ కూడా సంక్లిష్టంగా ఉందంటూ విద్యార్థులు కూడా ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో ఆందోళనకారులు ఇటీవల దేశంలో వందలాది పాఠశాలలకు నిప్పంటించిన విషయం తెలిసిందే.

పోలీసుల అదుపులో ఆర్మీ అధికారి భార్య

(మొదటి పేజీ తరువాయి)

క్రమంగా రక్షణ రంగానికి సంబంధించిన విషయాల వైపు మళ్లించారు. ఈ విషయం తెలియని మహిళ వారిని నిజమైన విద్యావేత్తలుగా నమ్మి.. వారి ఉచ్చులో పడిపోయింది. రక్షణ, ఆయుధ వ్యవస్థలపై వ్యాసాలతో పాటు కీలక సైనిక స్థావరాల ఫొటోలు, వీడియోలు వాటిలో పొందుపరిచింది. రక్షణ రంగానికి సంబంధించిన వివరాలను కూడా ఆమె వారికి చేరవేసిందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.



భూతాపంతో పెరగనున్న ఏసీ కాలుష్యం

(మొదటి పేజీ తరువాయి)

36 శాతం పెరుగుతుంది. ప్రస్తుతం వినియోగిస్తున్న ఏసీల ఇంధన పొదుపు సామర్థ్యం తక్కువగా ఉంది. 2033 నాటికి కొత్తగా అమ్మే ఏసీలు ఉత్తమ మోడళ్లు, అత్యుత్తమ ఇంధన పొదుపు పనితీరు నిబంధనలు అమలు చేస్తే, 2035 నాటికి ఏసీల విద్యుత్తు వినియోగాన్ని ఏడాదికి దాదాపు 86 టెరావాట్ గంటల వరకు తగ్గించవచ్చు. ఇది దేశ విద్యుత్తు వినియోగంలో 4 శాతానికి సమానం. దేశంలో 2020లో ఏసీల వాడకం 9 శాతం ఉంది. ప్రస్తుతం 15శాతం కుటుంబాలు వినియోగిస్తున్నాయి. ఏటా ఉష్ణోగ్రతలు, వడగాలుల తీవ్రత పెరగడంతో 2050 నాటికి ఇది 33 శాతానికి చేరుతుందని అంచనా. ఏసీ డిమాండును తట్టుకుని భూతాపాన్ని అదుపులో పెట్టాలంటే.. సోలార్, విండ్ లాంటి పునరుత్పాదక ఇంధన వనరులను, వినియోగాన్ని భారీగా పెంచాలి.

హైడ్రో ఫ్లోరో కార్బన్లతో ఎక్కువ భూతాపం..

విద్యుత్తు వినియోగం కన్నా.. ఏసీల ఉద్గారాలు వాతావరణాన్ని మరింత ప్రభావితం చేస్తాయి. ఏసీల్లో శీతలీకరణ పదార్థాలుగా వాడే హైడ్రో ఫ్లోరో కార్బన్లు (హెచ్ఎఫ్ సీ)... కార్బన్ డయాక్సైడ్ కన్నా ఎక్కువ భూతాపం కలిగిస్తాయి. ఏసీల్లో ఉపయోగించే హెచ్ఎఫ్సీ ఆర్-410ఏ.. కార్బన్ డయాక్సైడ్ కన్నా 2,088 రెట్లు ఎక్కువ భూతాపం కలిగించే సామర్థ్యం (జీఎంపీ) ఉంది. 2050నాటికి ఏసీల వినియోగం కారణంగా సగటు ఉష్ణోగ్రత 0.03 - 0.07 డిగ్రీలకు పెరిగే ప్రమాదముంది. భూతాపం 3 డిగ్రీలు పెరిగితే దేశ తలసరి జీడీపీలో 32 శాతం కోల్పోతుందని ఆందోళన వ్యక్తంచేసింది.

క్లీన్ ఎనర్జీగా మారాల్సిందే...

భారత్ క్లీన్ ఎనర్జీ దిశగా వేగంగా మారాలి. లేదంటే ఏసీ ఉద్గారాలు పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఇంధన పొదుపు సామర్థ్యం కలిగిన ఏసీలు వినియోగించాలి. మెరుగైన మోడళ్లను ప్రోత్సహించాలి. పునరుత్పాదక ఇంధన వనరుల వ్యవస్థలు భారీగా ఏర్పాటు చేస్తే పవర్ గ్రిడ్ పై ఒత్తిడి తగ్గుతుంది. ఇండ్లల్లో ఉష్ణోగ్రతలు తగ్గించేలా భవన నిర్మాణ డిజైన్లు రూపొందిస్తే ఏసీ వినియోగాన్ని తగ్గించవచ్చునంటూ ఆ నివేదిక తెలిపింది.

టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు

ముంబై, అక్టోబర్ 18: ముంబైలోని రద్దీ ప్రాంతమైన జుహులో బాలీవుడ్ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్ను టార్గెట్గా చేసుకుని దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం రాత్రి 7:30 ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ కారులో ప్రయాణిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మోటార్ ట్యాక్సీపైవచ్చిన ముగ్గురు దుండగులు ఆయన వాహనంపైకి 5 రౌండ్లకు పైగా కాల్పులు జరిపారు. ఈ ఊహించని పరిణామానికి కారులో ఉన్నవారు అప్రమత్తమవడంతోటైగర్ ష్రాఫ్ ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. అయితే, ఈ కాల్పుల ఘటనలో టైగర్ ష్రాఫ్ కారు డ్రైవర్తో పాటు మరో ఆటోరిక్షా డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు.

విచారణకు ఆదేశించిన సీఎం ఫడ్నవీస్...

ఈ ఘటనపై జుహు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన ముంబై పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రముఖ నటుడు జాకీ ష్రాఫ్ కుమారుడైన టైగర్ ష్రాఫ్ పై జరిగిన ఈ దాడి ముంబై నగరంలో కలకలం రేపింది.

తొలి విడత నామినేషన్ ముగిసింది

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం సోమవారం అక్టోబర్ 19న అధికారులు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులకు అక్టోబర్ 21న మధ్యాహ్నం 3:00 గంటల వరకు అవకాశం కల్పించారు. అదే రోజు సాయంత్రం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అక్టోబర్ 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 30వ తేదీన ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలలో (13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు) మొత్తం 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల స్వీకరణ పూర్తవడంతో అభ్యర్థుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

యువత భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసా

(మొదటి పేజీ తరువాయి)

యువతకు ఏ విధమైన సహకారం అవసరమైనా అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని మంత్రి భరోసా ఇచ్చారు. యువత భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నగర పాలక సంస్థ కూటమి మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూష, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి, మల్లికార్జున ఫర్నిచర్ అధినేత రాజగోపాల్, విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు.

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

తిలకించిన వేలాది మంది భక్తజనంలో భక్తిపారవశ్యం వెల్లివిరిసింది.

సకల జీవకోటికి చైతన్యప్రదాత

సూర్యభగవానుడు సకల జీవరాశులకు చైతన్యాన్ని, ప్రకృతికి వెలుగును, జీవకోటికి శక్తిని ప్రసాదించే ఆరోగ్యప్రదాతగా జలందుకుంటున్నాడు. సూర్యతేజంతోనే చంద్రుడు సైతం ప్రకాశిస్తున్నాడని పురాణాలు పేర్కొంటాయి. సూర్యప్రభ వాహనంపై స్వామివారిని దర్శించుకోవడం వల్ల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం త్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీ మలయప్పస్వామివారు తిరుమాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, జానకీ దేవి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మ ఆశీస్సులతో రాష్ట్ర సుభిక్షంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్ర ప్రజలందరు సుభిక్షంగా ఉండాలన్నారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల పవిత్ర సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

భక్తులకు సజావుగా దర్శనం కల్పించేందుకు సమన్వయంతో ఏర్పాట్లు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఉత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీటితో పాటు మజ్జిగ, పాలు తదితర అవసరమైన వసతులు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం అధికారులు, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దసరా మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

తప్పు చేశాం

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశారు. అన్నింటిపై పూర్తి సాక్ష్యాధారాలను ఆయన గవర్నర్కు సమర్పించారు. రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులను బెదిరించి నామినేషన్లు కూడా వేయనీయకుండా అడ్డుకున్నారని, పలుచోట్ల రిటర్నింగ్ అధికారుల ఎదుటే నామినేషన్ పత్రాలను చింపేసిన ఘటనలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటూ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మౌనం వహించడం, పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి తొత్తుగా మారి తప్పుడు కేసులు బనాయిస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్ రెడ్డిపై జరిగిన దాడి, ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, మద్దిల గురుమూర్తిలపై పెట్టిన అక్రమ కేసులను కూడా ఆయన ప్రస్తావించారు. వీటన్నింటి నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పారదర్శకత తీసుకు రావడానికి నామినేషన్ల ప్రక్రియను ఆన్లైన్ విధానంలో లేదా సెంట్రలైజ్డ్ విధానంలో స్వీకరించాలని, ఎన్నికల విధుల్లో కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించాలని, పోలింగ్ బూతులు, స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సీసీ కెమెరాల నిఘాతో ప్రత్యక్ష ప్రసారం (లైవ్ వెబ్కాస్టింగ్) నిర్వహించాలని గవర్నర్కు విజ్ఞప్తి చేశారు.

సీఈసీ నియామక విధానంలో సంస్కరణలు తీసుకరావాలి..

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నియామక విధానంలో సంస్కరణలు తీసుకురావాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఎన్నికల కమిషనర్ను అధికారంలో ఉన్న పార్టీలు ఎంపిక చేసే విధానం మారాలన్నారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కలిసి సీఈసీని ఎంపిక చేసే విధానం ఉండాలని సూచించారు. వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయత పెరగాలంటే నియామకాలు నిర్దేశిత విధానం ప్రకారం జరగాలని జగన్ పేర్కొన్నారు. గతంలో సీఈసీ ప్రతిపాదనకు తాము ఒప్పుకోవడం తప్పే అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. గతంలో సీఈసీ నియామకానికి సంబంధించిన విధానానికి తాము మద్దతు ఇచ్చామని, అయితే ఇప్పుడు ఆ మద్దతును ఉపసంహరించుకున్నామని తెలిపారు. తప్పు జరిగిన తర్వాతే తాము కూడా ఈ అంశాన్ని గుర్తించామన్నారు. అందుకే నియామక ప్రక్రియలో మార్పులు తీసుకురావాలని కోరుతున్నట్లు చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ నియామకంతో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామక విధానంలోనూ సంస్కరణలు అవసరమని జగన్ అభిప్రాయపడ్డారు.

ఎస్ఈసీ కూడా చోద్యం చూసింది..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేటా ఒకప్పుడు చంద్రబాబు పాలనలో సీఎస్ గా పనిచేశారని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఆయనను తప్పించిందని జగన్ గుర్తు చేశారు. తమ హయాంలో ఎన్నికలు జరిగితే నిమ్మగడ్డ రమేష్ కుమార్ ను అడ్డంపెట్టి అనేక అవరోధాలు సృష్టించారని జగన్ అన్నారు. పుంగనూరు, తిరుపతి, పులివెందులలో ఎందుకు నామినేషన్లను అడ్డుకున్నారని ప్రశ్నించారు. వైసీపీ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కున్న ఘటనలు జరిగాయని, అయినా పోలీసులు, ఎస్ఈసీ చర్యలు తీసుకోవడం లేదన్నారు.

చంద్రబాబుకు ధైర్యం లేకనే...

నిజంగా తన పాలనపై తనకు నమ్మకముంటే నిజాయితీగా ఎన్నికలు జరపాలని అన్నారు. అప్పుడు ప్రజా తీర్పు ఏంటోతెలుస్తుందని జగన్ అన్నారు. నామినేషన్ పత్రాలను చించేస్తుంటే ఇక ఎన్నికలు ఎలా జరుగుతాయో అందరికీ అర్థమవుతుందన్నారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు అనిల్ చంద్ర పునేటా నేతృత్వంలో ఎన్నికలు సజావుగా జరుగుతాయన్న నమ్మకం లేదని వైఎస్ జగన్ అన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి జనం ఎవరేంటో తెలుసుకున్నారని కూడా జగన్ అన్నారు. చంద్రబాబు రక్త చరిత్ర మరోసారి బయటపడిందని వైఎస్ జగన్ అన్నారు.

రణరంగంగా మారిన పురపోరు

(మొదటి పేజీ తరువాయి)

స్పందించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అదనపు పోలీసు బలగాలను మోహరించి ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు.

ఎన్నికల తదుపరి షెడ్యూల్

నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది.

- **అక్టోబర్ 19:** నామినేషన్ల పరిశీలన
- **అక్టోబర్ 21:** నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు
- **అక్టోబర్ 28:** పోలింగ్ (జీవీఎంసీ సహా ఇతర స్థానిక సంస్థలకు)
- **అక్టోబర్ 30:** ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాతే ఏయే స్థానాల్లో ఏకగ్రీవాలు అయ్యాయి, ఎక్కడెక్కడ ఇరుపక్షాల మధ్య ప్రత్యక్ష పోరు జరగబోతోందనే పూర్తి స్పష్టత రానుంది. ప్రస్తుతానికి మాత్రం ఏపీ పల్లెల్లో ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది.

ఆమె వయస్సు 30.. ఆయన వయస్సు 75

వారి ప్రేమ వివాహానికి నిశ్చితార్థం..

హైదరాబాద్, అక్టోబర్ 18: సుమారు 30 ఏళ్ల వయస్సున్న యువతి, 75 ఏళ్ల వృద్ధుడ్ని



దుర్గా దేవి అలంకరణలో దర్శనం



కాట్రేనికోన అక్టోబర్ 18(మనం ప్రతినిధి): శ్రీశ్రీశ్రీ పట్టాభిరామ స్వామి వారి ఆలయంలో కోలు వై యు న్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవంలో బాగంగా 8 వ రోజు శ్రీ దుర్గా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. .అమ్మవారి అలంకారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది 8వ రోజు పూజ చేయించుకున్న దంపతులు గుంటూరి వెంకటేశ్వర రాజు, భారతి దేవి దంపతులు. కుంకుమ పూజలు నిర్వహించ డం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు .అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

అమ్మ వారికీ కుంకుమ పూజ



కాట్రేనికోన అక్టోబర్ 18(మనం ప్రతినిధి): కాట్రేనికోన మండలం గెద్దనపల్లి పంచాయతీ శివారు చింతలమెరక గ్రామంలో శ్రీశ్రీ శ్రీ విజయ లక్ష్మి దుర్గా ఆలయం నందు దేవి నవరాత్రి మహోత్సవములు సందర్భంగా ఆదివారం సంసాని దుర్గాప్రసాద్ శ్రీమతి తులసి కుటుంబ సభ్యులు దంపతులు చే ఆలయ పురోహితులు అకొండి మహేష్ శర్మ , ఆకొండ శ్రీకాంత్ శర్మ కుంకుమ పూజ, సహస్రనామార్చన అమ్మవారికి నిర్వహించారు అధిక సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు విచ్చేసి కుంకుమ పూజలు జరిపారు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడులకు పాల్పడుతున్నారు

మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, అక్టోబరు 18(మనంన్యూస్): ఎన్డీఏ కూటమికి ప్రజల్లో పెరుగుతున్న మద్దతును చూసి వైసీపీ నేతలు ఓటమి భయంతోనే హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారని, బయటి వ్యక్తులను తీసుకొచ్చి ధర్మవరం ప్రశాంతతను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు మంత్రి సత్య కుమార్ యాదవ్ విమర్శించారు. ధర్మవరం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆదివారం ఎన్డీఏ కూటమి అభ్యర్థులతో కలిసి నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యంగా పోటీ చేసి మున్సిపాలిటీలో ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే వైసీపీ వివాదాలు సృష్టిస్తోంది

ధర్మవరంలో కూటమికి ప్రజల్లో పెరుగుతున్న మద్దతును చూసి వైసీపీ నేతలు ఓటమి భయంతో ఎన్నికల ప్రక్రియలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి విమర్శించారు. బయటి వ్యక్తులను తీసుకొచ్చి ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూడటం సరికాదన్నారు. నామినేషన్ పత్రాలు చించివేశారన్న ఆరోపణలను ఖండిస్తూ, ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంతంగా జరగాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

ధర్మవరం ప్రశాంతతకు భంగం కలిగించవద్దు..

రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, ఘర్షణలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతోనే విజయం సాధించాలని, రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

ధర్మవరంలో చేనేత కార్మికుల అభ్యున్నతికి క్లస్టర్ ఏర్పాటు, ఆయుర్వేద వైద్య కళాశాల, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని



మంత్రి తెలిపారు. సుమారు రూ.110 కోట్లతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ధర్మవరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు.

48 వార్డుల్లోనూ ఎన్డీఏ విజయమే లక్ష్యం...

టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ధర్మవరం మున్సిపాలిటీలోని 48 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పరిశే సుధాకర్ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ధర్మవరం అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రశాంత వాతావరణమే తమ ప్రధాన లక్ష్యాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, ఓబులేసు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ

● **జిల్లా ఎస్పీ పి.జగదీష్**

అనంతపురం, అక్టోబర్ 18(మనం బ్యూరో): అనంతపురం నగరంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా సాగేలా చూడాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అధికారులను ఆదేశించారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఎస్పీ ఆదివారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మరియు ప్రభుత్వ ఆరట్స్ కళాశాలలోని నామినేషన్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ అమలు చేస్తున్న భద్రతా చర్యలను, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

నిబంధనల ఉల్లంఘన జరగకూడదు :

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..



ఎన్నికల నియమ నిబంధనలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల పరిధిలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరిగినా ఉపేక్షించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు.

శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యం :

బందోబస్తు విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కేంద్రాల వద్దకు వచ్చే నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజల రాకపోకలను నియంత్రించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు లేదా అవాంఛనీయ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సిబ్బంది అందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ గారి వెంట నగర సి.ఐ లు, తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన
ఎన్నికల జనరల్ అబ్జర్వర్



అనంతపురం, అక్టోబర్ 18(మనం న్యూస్): అనంతపురం నగర పాలక సంస్థలో స్థానిక సంస్థల ఎన్నికలు - 2026లో భాగంగా నామినేషన్ల ప్రక్రియను ఆదివారం అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్ పరిశీలించారు. నగర పాలక సంస్థకు చేరుకున్న జనరల్ అబ్జర్వర్ కు కమిషనర్ స్వాగతం పలికారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుని, సజావుగా నామినేషన్ల ప్రక్రియ జరిగేలా నగర పాలక సంస్థ కమిషనర్ కు పలు సూచనలను జనరల్ అబ్జర్వర్ జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్నరవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు

అమలాపురం అక్టోబర్ 18 మనం ప్రతినిధి: అన్నంపాలెం టోల్ ప్లాజా , భట్నవల్లి వై జంక్షన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు నిర్వహించి 4 బస్సులపై కేసులు నమోదుచేసి 9,600 రూపాయలు అపరాధరుసుము విధించామని అదేవిధంగా 216 జాతీయ రహదారిపై అనధికారికంగా నిలుపుదల చేసిన 3 లారీలపై కేసులు నమోదు చేసి 10,800 రూపాయలు అపరాధరుసుము విధించామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లు రహదారి భద్రత నిబంధనలు లోబడి నడుచుకోవాలని అదేవిధంగా జాతీయ రహదారిపై పార్కింగ్ నిషిద్ధమని కఠిన చర్యలు తప్పవని డీ.టీ.ఓ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్లు సురేష్ కుమార్, కౌశిక్ మరియు వరప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూషకు భారీ మెజారిటీ అందించాలి

కర్నూలు నగర అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలి: మంత్రి టీజీ భరత్

కర్నూలు: అక్టోబర్ 18 మనం న్యూస్ కర్నూలు నగర కూటమి మేయర్ అభ్యర్థిగా బరిలో ఉన్న విజయ ప్రత్యూష నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తీపాటి నాగరాజు, గౌరు జనార్ధన్ రెడ్డి, బీజేపీ నేత సూర్య, జనసేన నేత అర్షద్ తో కలిసి ఆమె నామినేషన్ వేసారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. విజయ ప్రత్యూష ఉన్నత విద్యావంతురాలని, బీటెక్ పూర్తి చేశారని తెలిపారు. గత ఎన్నికల్లో ఎన్నో కష్టాలను ఎదుర్కొని కార్పొరేటర్గా విజయం సాధించిన ఆమె, తన వార్డులో అభివృద్ధి పనుల కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. దివంగత బొల్లెద్దుల రామకృష్ణ తన వార్డు అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని, ఆయన కుమార్తె విజయ ప్రత్యూషకు ప్రజలు ఆశీర్వాదం అందించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కూటమి ప్రభుత్వం గెలిచిన వార్డుతో సంబంధం లేకుండా కర్నూలు నగరంలోని అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్లో అభివృద్ధి పనులు సజావుగా కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని 68 వార్డుల్లోనూ అభివృద్ధి జరగాలంటే కూటమి మరింత బలపడాలని అన్నారు.

2024 ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన మద్దతును



మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగించాలని కోరారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించే వారి తీరును ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కర్నూలు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి టీజీ భరత్ తెలిపారు. కూటమిలోని అభ్యర్థుల మధ్య ఏవైనా సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని, నామినేషన్లు, ఉపసంహరణ ప్రక్రియ ముగిసేలోగా సమన్వయంతో అన్ని సమస్యలను పరిష్కరించుకుంటామని చెప్పారు. మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష మాట్లాడుతూ ప్రజలు తనను తప్పకుండా గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కర్నూలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటానన్నారు.

కూటమి అభ్యర్థుల నామినేషన్లు



కళ్యాణదుర్గం అక్టోబర్ 18 మనం న్యూస్: కళ్యాణదుర్గం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి బుట్టా లక్ష్మి తిమ్మరాజుతో పాటు 32 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్లు సమర్పించారు.

అంతకుముందు పట్టణంలోని వాల్మీకి సర్కిల్లో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరాగా, అక్కడి నుంచి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కూటమి శ్రేణుల ఉత్సాహం, నినాదాలతో పట్టణంలో ఎన్నికల సందడి నెలకొంది.

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన స్థానిక సంస్థల ఎన్నికల వ్యయ పరిశీలకులు



అనంతపురం, అక్టోబర్ 18 (మనం న్యూస్): అనంతపురం నగర పాలక సంస్థలో స్థానిక సంస్థల ఎన్నికలు - 2026లో భాగంగా నామినేషన్ల ప్రక్రియను ఆదివారం మధ్యాహ్నం అనంతపురం జిల్లా స్థానిక సంస్థల వ్యయ పరిశీలకులు జి. సుబ్బరాజ్ పరిశీలించారు. అంతకుముందు నగర పాలక సంస్థకు చేరుకున్న వ్యయ పరిశీలకులకు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వాగతం పలికారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుని, సజావుగా నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ జస్వంత్ రావుకు సూచించారు. ముఖ్యంగా ఎన్నికల్లో ఆయా అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు రోజువారీ ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేలా అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్. డి .ఓ ప్రేమంత కుమార్, టి పి ఓ ఓంకార్ , మాస్టర్ ట్రైనర్ రిటైర్డ్ ఎస్ డి సి గోవిందరాజులు ,ఆయా డివిజన్ల ఆర్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అలర్ట్.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక నిఘా.. ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

ర్యాలీలు, సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి..

సోషల్ మీడియా పోస్టులపైనా నిఘా

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ స్పష్టీకరణ



పుట్టపర్తి అక్టోబర్ 18, మనం న్యూస్: ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ స్పష్టం చేశారు. జిల్లాలో మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల భద్రతకు, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అమలులో ఉన్న 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు నిర్వహించరాదని ఎస్పీ పేర్కొన్నారు. అమలులో ఉన్న ఆంక్షలకు విరుద్ధంగా నలుగురికి మించి గుమిగూడకూడదని, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు చట్ట నిబంధనలను గౌరవించాలని సూచించారు. ఎన్నికల సమయంలో వ్యక్తిగత విభేదాలు, రాజకీయ వైరుధ్యాలతో ఘర్షణలకు దిగకుండా సంయమనం పాటించాలని కోరారు.ఎన్నికల సమయంలో సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, వివాదాలకు దారితీసే సందేశాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రచారాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించేలా వ్యవహరించినా, అమలులో ఉన్న ఆంక్షలను ఉల్లంఘించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయకుండా, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని ఎస్పీ స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాజకీయ నాయకులు, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజల భద్రత, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, శాంతికి విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు

భూగోళానికి జ్వరం

పసిఫిక్ జలాలపై
అసాధారణ ఉష్ణ కల్లోలం
తూర్పు గాలుల బలహీనతతో
మేఘాల గమనంలో మార్పులు
రుతుపవనాల రాకలో
అనిశ్చిత అలజడి
వర్షపాతం లో హెచ్చుతగ్గులు
చెరువుల్లో ఇంకుతున్న జలజాడలు
పొలాల నిండా
ఎండిపోయిన ఆశలు
రైతు బతుకుపై
కరువు సంతకం చేస్తోంది

ప్రకృతి సమతూకంపై
సముద్రం లిఖించే
సెగల అక్షరమే
ఎల్ నినో
అడవులనిండా పచ్చని ఊపిరి
నదుల నిండా
జీవ జలాల పరవళ్ళు కావాలి
నేల గుండెల్లో
విత్తనాల భద్రత
ప్రకృతి సమతుల్యతే
మనిషి మనుగడకు హామీ .

- మండాది గోపీనాథ్
9885045344

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

భారతదేశం గర్వించదగ్గ కవి



'సినిమా హాలు నిర్మా ణం కోసం నేను స్థలం కొన్నరోడ్డులో పేరు మోసిన మైకా కంపెనీలన్నీ వున్నా యి. చుట్టు ప్రక్కలున్న ఇళ్ళన్నీ సంపన్నులవే. ఆ ఇళ్ళ మధ్యలో థియేటర్ కట్టాలంటే వాళ్ళు అడ్డుపడతారని నాకు తెలుసు. అప్పట్లో గూడూరు మున్సిపల్ కమీష నర్‌గా వున్న గుంటూరు శేషేంద్ర శర్మగారిని కలిసి నా ఆందోళన వారికి చెప్పాను. శర్మగారు మున్సి పల్ పర్మిషన్‌తో పాటు అవసరమైన మిగతా పర్మి షన్‌లు కూడా వారి పలుకుబడితో నాకు ఇప్పిం చారు'.

సుప్రసిద్ధకవి గుంటూరు శేషేంద్రశర్మ కొన్నాళ్ళు గూడూరు పురపాలక సంఘ కమీషనర్‌గాపనిచేశారని ఇంతకుముందే చెప్పాను. వారు భారతదేశం గర్వించదగ్గ కవి.సంస్కృతాంధ్ర భాషల్లోనే కాక ఆంగ్లంలో కూడా అద్భుత నైపుణ్యంగల సాహితీవేత్త.

వారి నోటినుండి జాలు వారే ప్రతిపదంలోనూ కవిత్వం పరవళ్ళు దొక్కు తుంది. శర్మగారు అతి చిన్న వయసులోనే వాల్మీకి రామాయణాన్ని గురించి 'షోడసి' అన్న పేరుతో చాలా వ్యాసాలు రాశారు. వారి అభిమానులు చాలామంది శర్మగారిని 'యుగకవి'గా పేర్కొం టారు. విశ్వనాథ వారిలాగే ఎవరికి తలవంచని కవి శేషేంద్ర. ఆయన



రస్తా నా రంగస్థలం

కనుకనే కొందరు నన్ను కవి అంటారు
భవనాలను మింగాలి,
జనాలను మాలగా వేసుకోవాలి
రస్తాను రంగస్థలం చేసుకోవాలి
ఎంత రోడ్ల అనుభవం,
ఎంత జనుల క్యూ అనుభవం
గడిస్తాడో అంత సంపద అది
ఒక మనిషి కవిగా జన్మ ఎత్తడానికి -
ఎన్ని దేశాల్లో తీర్థయాత్రలు చేస్తాడో
అంత విస్తార కావ్యానుభవం గడిస్తాడు

కవి, కవి ఎత్తు -
ఈ విస్తృత సంపద రూపాంతరమే!
ఈ అనుభవం మనిషిని రసాలుగా మార్చి
జనుల్లోకి ప్రవహింప జేస్తుంది.
భవనాంతరాల్లోకి పోయి శయ్యాంతరాలకు
శరీరం అర్పించి
'అదే స్వర్గంగా భావించేవాడు
బ్రహ్మాండమైన నదిలా
ప్రవహించే మానవ జీవనంలో
జలకమాడే హిరణ్య సంపద కోల్పోతాడు
భవనంలో ఎంత లోతుకుపోతే
అంత నష్టం సంభవిస్తుంది మనిషికి-

కవి అంత చిన్న కవి అవుతాడు అకవి అవుతాడు
కవి ఏమిటి గోలీ మారో! మనిషి ప్రధానం!
సామాన్యుల సుఖదుఃఖాలకు
ఎంత శిరస్సు వంచుతాడో మనిషి
అంత ఎదుగుతాడు కవితా శిఖరంగా -

-శేషేంద్ర

నేను కవిని అనే మాటను గోలీతో కాల్చు
నాకు గర్వం నేను మనిషిని అని
నేను క్యూలో నుల్చుని అనుభవిస్తాను జీవితాన్ని
నేను ముందుకుపోను నా ముందు
నుల్చున్న మనిషిని వెనక్కి తోసి-
పోస్టుకార్డు క్యూలో ముందున్న
మనిషి ముందుకు పోతేనే
నా మనస్సుకు హాయి - నేను జనంలో నడుస్తాను

దౌర్జన్యంగా ఒకడు మరొకడ్ని కొడుతుంటే
నాలో ఒక అగ్నిపర్వతం ఘుర్ఘర
ధ్వని చేస్తూ ఉంటుంది
ఒక్కసారి అగ్నిచ్ఛటల ఝంఝను విసురుతుంది
ఎంత క్యూ గత జీవితం అనుభవిస్తానో
ఎంత ఎక్కువగా నా కాళ్ళని రోడ్లకు అప్పగిస్తానో
అంత మానవీయ సంపద ఆర్జించి గర్విస్తాను

నా 'మల్లెమాల రామాయణం' చదివి మళ్ళీ పుట్టాడు వాల్మీకి మల్లెమాలగా అని తన అభిప్రాయాన్ని రాతపూర్వకంగా వెలి బుచ్చారు. వారు ఈనాడు మన మధ్య లేకపోయినా వారి రచనలు కవితా ప్రియులందరి హృదయా లలో గుబాళిస్తూనే వుంటాయి.

నేను వారి మరణ సందర్భంగా... అలవోకగా
నీవు కలము దూసితివేని/ కడలి తరంగముల్ జడిసి ఆగు!/ కలను సైతము నీవు గళము విప్పితివేని వేద నాదమ్ములు విస్తుబోవు!/ శిరమెత్తి నింగిని ఉరిమి చూసితి వేని/ చుక్క లక్షరములై చుట్టు మూగు!/ చిరునవ్వుతో నీవు చేయి నూపితివేని/ రసరమ్య భావముల్ రాసులీను!/ పెక్కులేటికి చివరగా ఒక్కమాట/ సుకవిజన చంద్ర/ శేషేంద్ర, సుగుణ సాంద్ర!...

చెవికి నోరూర జేయు నీ కవిత వినిన/ చివురు లామని వీడి నీ చెంత జేరు!/ కవికి గర్వము ముంజేతి కంకణమని/ ఉర్వి నెవరికి తలవంచకుండ బ్రతికి/ స్వర్గమందున గల కవి చక్రవర్తి/ విశ్వనాథను కలయంగ వెడలినావు! అని నివాళులర్పించాను.

'ఇదీ నా కథ' నుంచి
- మల్లెమాల సుందరరామి రెడ్డి
రేపు గుంటూరు శేషేంద్ర శర్మ శత జయంతి

సూక్ష్మరూప జీవనవ్యక్తీకరణలే 'తటిల్లతలు'




ఇప్పటివరకు తెలుగు సాహిత్యాన్ని ఎందరో భిన్న మైన కవులు విభిన్న కవితా రీతులైన మినీకవితలు, లఘు కవితలు, నానీలు, మొగ్గలు, రెక్కలు, హైకూలు లాంటి ప్రక్రియలతో సుసపన్నం చేశారు. ఇంకా కొంతమంది కవులు ఈ ప్రక్రియల్లో కవితల్ని రాస్తూ కవిత్వ సంపుటాలను వెలువరిస్తూనే ఉన్నారు. అయితే! ఈ మధ్యనే ప్రముఖకవి, కథకులు కటుకోజ్వల ఆనందాచారి గారు 'తటిల్లతలు'శీర్షికతో మెరుపుకవితలసంపుటిని ఆంగ్లానువాదంతో వెలువరించి మన మనసుల్లో మెరిపించారు. ఆనందాచారి కవిగా, కథకునిగా, పాటల రచయితగా, చిత్రకారునిగా నైపుణ్యం కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

ఈ గ్రంధంలోని కవితావాక్యాలు ఏవో అలవోకగా ఉబుసుకుపోక రాసినవి కావు. తన చుట్టూ ఉన్న సామాజిక స్థితిగతుల్ని, మానవ నైజాన్ని ఆకళింపుచేసుకొని అల్లిన కవితా మాలలు. ఇంకా తన వ్యక్తిగత అనుభవసారపు కమ్మెచ్చులోంచి సాగతీసిన ఈ అర్థవంతమైన వాక్యాల తీగల్ని, మన జీవితాలకు కూడా అన్వయించుకొదగిన జీవిత సత్యాలు. నిత్యజీవితంలో ఆయన మనసులో తటిల్లన మెరిసిన ఆలోచనల్ని కవితాక్షరాల్లోకి అనువదించి ఎలా మెరిపించారో చూడండి. 'చదరంగంలో/పావులు కదిపినట్టు/ తెలివి గల ఎత్తులు వేస్తే/ఆట మాత్రమే గెలుస్తాం/ జీవితంలో అలా గెలవలేం!' అంటారు.

చదరంగపు ఆటలో తెలివిగల ఎత్తులతో ఆట గెలవొచ్చేమో కానీ, జీవితపు ఆటలో గెలవాలంటే అందివచ్చిన అవకాశాల్ని వివేకంతో ఆడి గెలవా లనే జీవిత సత్యాన్ని తెలిపే వాక్యాలివి.

నిజానికి ఈ తటిల్లతలకు అర్థతాత్పర్యాల్ని విప్పి చెప్పే అవసరం లేదు. చదవగానే పాఠకుల గుండెల్లోకి దూసుకుపోయే వాక్యనిర్మాణం ఈ తటిల్లతలల్లో ఉంది. ఆ వాక్యాల గాఢత మనసుల్లో చేరిఆలోచింపచేస్తది. ఈ 105 తటిల్లతలన్నీ సాదాసీదా వ్యవహారిక బాషలో చాలా ట్రాన్స్ పరెంట్‌గా ఎటువంటి సంక్లిష్టత లేకుండా రాసిన జ్ఞానగుళికలు. చూడండి ఎంత సింపుల్ గా చావు పుట్టుకల గురించి రాస్తారో ..ఏడుస్తూ పుడతాం/ ఏడుస్తూ చనిపోతాం/కానీ మధ్యలోనే ఈ అసంబద్ధ ఆరాట పోరాటాలు/అర్థంలేని స్వార్థ పూరిత ఆడంబరాలు ఎందుకు?' అని ఈ ఆధునిక మానవుల్ని ప్రశ్నిస్తున్నట్లుగా ఉంటాయి ఈ వాక్యాలు.



ఇందులోచాలాసార్లు జీవితాన్ని నిర్వచిస్తుంటాడు. 'జీవితం/ కవిత్వంలా/ ఎడిటింగ్‌కి వీలవట్లేదు.. అంటాడు. మరోచోట..నీ ఊహలకన్న మిన్నయినవి/ జరుగుతున్నాయి కవీ..?/ జగత్తుకన్నా కవిత్వం/ అబ్బురపరచ లేదు'. అంటూ కవిత్వమైనా.. కళలనైనా సవరించు కోవచ్చు కానీ, జీవితాన్ని అలా ఎడిట్ చేసుకోలే మని తేల్చి చెబుతాడు. బతుకు పోరాటం/ మాటనేర్పింది/పుస్తకం/ఏం మాట్లాడాలో నేర్పు తుంది.రెండూ మనిషిని ఆవిష్కరిస్తాయి అంటాడు. మనుషులమధ్య పెరుగుతున్న దూరాన్ని గురించి చూడండి..

'నువ్వొకసారి/వచ్చి స్పర్శించిపో/మందులు నయం చేయనిది/నీ చేయి చేస్తుంది/ మనుషుల ఇమ్యూనిటి/కలిసిన తనంలోనే ఉంది' ఈనాటి ఆధునికయుగంలో మనుషుల మధ్య పెరుగు తున్న దూరాల్ని, మానవ సంబంధాల వెలితిని ఈ క్రింది చిక్కనైన వాక్యాల్లో చక్కగా వర్ణిస్తాడు. మను షులు కలుసుకుంటూ కష్టసుఖాల్ని కలబోసు కుంటూ సాంత్వన పొందాలంటాడు. కలయిక లోనే బడలిక తగ్గుంతుందని అర్థం స్ఫురించే వాక్యాలివి.

'వేలఏండ్ల గమనంలో/ఏం నేర్చుకున్నాం మనం/ ఒక మనిషితో మనిషిలా/వ్యవహరించలేక పోతున్నాం' ముఖ్యంగా పై కవితలో ఉత్తమ జ్ఞానాన్ని పొందడం గురించి చెబుతూ.. ఏండ్ల నుంచి నేర్చుకుంటున్నా మన ఆలోచనా విధా నంలో గాని,మనస్తత్వాల్లో గాని మార్పు రాలేదనే వ్యంగ్యం కనిపిస్తుంది. 'ఏదైనా ఒకటి చెప్పు/పనేదయినా చేయి/ లేదంటే రాస్తూనే ఉండు/నివ్వు సజీవంగా ఉన్నం దుకు గుర్తులవి'అంటాడు. రైతు ఆత్మహత్యల మీద గుండె బరువెక్కే వాక్యాలు 'భూమికి శ్రమనల్లిన/కలనేత ఇతడు/ కలలపంటపై/చితిగా మారుతున్నాడు' భూమిని చెమట చుక్కలదారాలతో సేద్యం చేసే రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దొరకక చేసిన అప్పులు తీర్చలేక తన పంటనే చితిగా చేసుకొని ప్రాణత్యాగం చేసుకుంటున్న హృదయవిదారక దృశ్యాన్ని మన కళ్ళల్లో దృశ్య మానం చేస్తాడు.

ఆనందాచారిలో ఒక ప్రేమ కవికూడా ఉన్నాడ నేందుకు ఆయన రాసిన ప్రేమాన్విత తటిల్లతలు చూడండి.. 'నీకోసం/ ఎదురు చూపులో/ కాలం కరిగి తేనేం/ వేచిచూసే కనుల దాహం/ నిముష నిముషం పెరిగితేనేం/మధురమైన తలపోతలన్నీ/ మనసు కడుపున నిండుతున్నాయి.. ప్రేమ నిండిన కళ్లతో ఎదురుచూస్తే కాలమే తెలియదు.గంటలు నిముషాల్లా కళ్ళముందే కరిగిపోయినా కనుల దాహం తీరదు ఆహా ఏమి భావన. ఎదురు చూపుల్లో ఉన్న మధుర మైన బాధనిఎంత అద్భుతంగాఆవిష్కరించారో ఈప్రేమ కవితలో.

ఈ సంపుటినిండా "Quotable quotes" లాంటి అద్భుతమైన వాక్యాలు ఉన్నాయి. శత్రువు, మిత్రుడు అని/పేర్లు పెడతాం/కానీ .. అది తెలుసుకోవడం/అంత సులువేం కాదు.

ఇంత అర్థవంతమైన ఆలోచణాత్మకమైన తటిల్లతలతో అంతే అద్భుతమైన శ్రీనివాస్‌గౌడ్ గారి ఆంగ్లానువాదంతో వెలువరించిన ఆనందా చారి గారికీ శుభాకాంక్షలతో...

-ప్రొ. బాణాల శ్రీనివాసరావు
9440471423

ప్రతిభా శాలి 'రఘు వర్మ'



బహుముఖ ప్రజ్ఞాశాలి, మితభాషి,ప్రముఖ కవి,రచయిత, అనువాదకుడు రఘువర్మ (అసలు పేరు తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ) 6.10.2026 సాయంత్రం తన కలాన్ని, గళాన్ని, కుంచెను వదిలి వెళ్ళిపోయాడు. కానీ కాలం రాకముందే కడతేర్చరావే కాలమా అని గొప్పమరణం గురించి. కాళోజి రామేశ్వరరావు అన్నట్లు రఘువర్మ గారు ఆకస్మికంగా వెళ్లిపోయి ఆత్మీయులకు, కుటుంబీకులకు, స్నేహితులకు ముఖ్యంగా తెలుగు సాహిత్య లోకానికి తీరని బాధను మిగిల్చాడు.

రఘువర్మ ఉస్మానియా యూనివర్సిటీలో కుందుర్తి ఆంజనేయులుపై ఎంఫిల్,పీహెచ్‌డి చేశాడు. రఘువర్మ మృదుస్వభావి. ఎవరిని ఏనాడు మాట వరసకైనా మనసు నొప్పించలేదు. ఈ ఛాయలన్నీ ఆయన రచనల్లో మనం చూడవచ్చు. ఇతను హృదయ జలధి,కవిత్వం వింత భాష, మూడో కంటిచూపు, మేఘ రాగరంజని మొదలగు వచన కవిత సంపుటాలు వెలువరించాడు. అనువాద రంగంలో రఘువర్మ గారు విశేషమైన కృషి చేశాడు. కాళిదాసు కావ్యాలు.. రవీంద్రుని గీతాంజలి, షేక్స్పియర్ మొదలగు వారి రచనలను సులభశైలిలో అనువదించారు. 2021లో కాళిదాసు మేఘసందేశం, 2022లో ఋతుసంహారం, 2023లో రవీంద్రుని గీతాంజలి భర్తృహరి నీతి శతకాలను సంస్కృతం నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. కాళిదాసు కావ్యాలను సహజంగా సరళంగా అనువదించారు. రఘువర్మ మరణంతెలుగు సాహిత్య లోకం గొప్ప అనువాదకున్ని కోల్పోయింది.

రఘువర్మ కృషిని గుర్తించి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అనువాద రంగంలో రామవరపు శాంత సుందరి అవార్డును ప్రదానం చేసింది. అదే విధంగా 2025వ సంవత్సరంలో కీర్తి పురస్కారాన్ని అందజేసి సత్కరించింది.రఘువర్మ గొప్ప చిత్రకారుడు. అతని పుస్తకాలకు తానే స్వయంగా అర్థవంతమైన ముఖచిత్రాలు గీసుకున్నాడు. తెలుగు సాహిత్యంలో లబ్ధ ప్రతిష్టులైన కొందరి పుస్తకాలకు తాను చిత్రాలు గీసిచ్చాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భారతీయ కవులు రచయితల ముఖ చిత్రాలు జీవం ఉట్టిపడేట్టు గీశాడు.రవీంద్రుడు మన కండ్ల ముందు ఉన్నాడా అన్నట్లు చిత్రాన్ని గీసేవాడు.

రఘువర్మ మంచి గాయకుడు. లలిత గీతాలను, తెలుగు, హిందీ పాత సినిమా పాటలను మూల గాయకులు పాడినట్లే ట్రాక్ మీద పాడేవారు. అతడు పాడుతుంటే రసజ్ఞత ఉట్టిపడేది.

చివరిదశలో దాదాపు 15 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గురుకుల కళాశాలలో కాంట్రాక్టు తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం చేశాడు. ఆదిలాబాద్‌లో దాదాపు దశాబ్ది కాలం పాటు విధులు నిర్వహిస్తున్న కాలంలో ఆదిలాబాద్ కవి మిత్రులతో సఖ్యతగా ఉంటూ ప్రతి సాహిత్య సభకు హాజరయ్యేవాడు. ఉదారి నాగదాసు స్మారక కవితా ఉత్సవానికి, ఉగాది కవి సమ్మేళనాలకు తప్ప కుండా పాల్గొనేవారు.

చివరికి జగిత్యాలలో అన్నదమ్ములతో కలిసి ఉంటూ వారే తన ప్రపంచ మనుకొని జీవితంలో చెదిరిన స్వప్నాలను కవితలుగా రాసుకుంటూ చిత్రాలుగా గీసుకుంటూ పాటలుగా పాడుకుంటూ గడిపాడు. చివరిదాకా తాను సంగీత సాహిత్య చిత్రలేఖన ప్రపంచంలోనే బతికిన గొప్పకళాజీవి. మంచి వ్యక్తిత్వానికి నమూనా మన రఘువర్మ మన మధ్య లేకపోవడం బాధా కరం.

- డా. ఉదారి నారాయణ
9441513666

మొల్ల సాబేరున్నిసాను చైర్మన్ గా గెలిపించుకుందాం.. సౌదీ చాంద్

నందికొట్కూరు (మనం న్యూస్): నందికొట్కూరు పట్టణానికి చైర్మన్ అభ్యర్థిగా మొల్ల సాబేరున్నిసా కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని నందికొట్కూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ సందర్భంగా సౌదీ చాంద్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.నందికొట్కూరు చైర్మన్ అభ్యర్థిగా అడ్వకేట్ జాకీర్ సతీమణి మొల్ల సాబేరున్నిసాకు అవకాశం కలిపించిన నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శివానందరెడ్డి. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య కుహృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసిన షేక్ చాంద్ భాషా నందికొట్కూరు నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు ముస్లిం మైనార్టీ ఓటరు మహాశయులకు తెలియజేయడమేమన ముస్లిం మైనార్టీ మహిళకు



నందికొట్కూర్ పట్టణ చైర్మన్ అభ్యర్థిగా మంచి అవకాశం కల్పించడం జరిగింది. కుల మతాలకు అతీతంగా సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో మొల్ల సాబేరున్నిసాకు గెలిపించాల్సిందిగా మీరందరు మీ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తారని నమ్మకంతో మీ అందరికీ తెలియజేయడం జరిగిందని ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు సౌదీ చాంద్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రసూల్ ఖాన్ మంచితనానికి మారుపేరు లాయర్ జాకీర్ హుస్సేన్ భార్య మొల్ల సాబేరున్నిసాను మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన మరుక్షణమే నందికొట్కూరు పట్టణ అభివృద్ధికి. త్రాగునీటి సమస్య కానీ డ్రైనేజీ సమస్య సాబేరున్నిసా ముందుండి సకాలంలో నందికొట్కూరు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి ఒక్క చిన్న సమస్యను కూడా త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని రసూల్ ఖాన్ తెలియజేశారు.

సాహిత్యంపై తెన్నేటి చెరగని సంతకం

తెలుగులో ప్రముఖ కవులు, రచయితలలో ఒకరు తెన్నేటి సూరి. అభ్యుదయ కవి. నవలాకారుడు, అనువాదకుడు. తన భావజాలాన్ని ఆవిష్కరించడానికి ఆయన కథ, వ్యాసం, కవిత, గేయం,నాటకం,నవల,అన్ని సాహిత్య ప్రక్రియ లను ప్రజల గుండె తలుపులను తట్టే సాధ నాలుగా వాడుకున్నాడాయన. అలనాటి మేటి పత్రికలు భారతి, ఆంధ్ర పత్రికల్లో సహాయ సంపాదకునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తన సాహితీ క్షేత్రాన్నిసుసంపన్నం చేశారు.



తెన్నేటి సూరి పేరుతో మొట్టమొదట స్ఫురించేది ఆయన చారిత్రక నవల. ఛంఘిజ్ ఖాన్. 12, 13 శతాబ్దాలలో మంగోల్లో జన్మ స్థలంగా, ఎడారిలో ఒక మహా సామ్రాజ్యాన్నే నిర్మించిన విజేత చంఘిజ్‌ఖాన్. అది కత్తి మీద సాములాంటి రచనలో చరిత్రలో జరిగిన సంఘటనలను వక్రీకరించకుండా, హెన్రీ హోవర్త్ దంపతులు రచించిన మంగోల్ చరిత్రను ఆధారంగా చేసుకొని, లోతుగా అధ్యయనం చేసి, చేయి తిరిగిన నవలాకారునిగా అద్భుత రచనతనదైన శైలిలో రచిం చారు. ఆ ప్రచురణ విశేష ప్రజాదరణ పొందింది. తెన్నేటి సూరి చెంఘిజ్ ఖాన్‌ను తొలిసారిగా ఆంధ్రపత్రిక, 1950 సెప్టెంబరు నుంచి ధారావాహికంగా ప్రచురింప బడింది. సెప్టెంబరు 1998) రేడియో నాటకంగా శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుసరించి ప్రసారం చేశారు. ఆంధ్ర పత్రికలో ఆయన వ్రాసిన ధారా వాహికను నవలా రూపంలో విశాలాంధ్ర వారు ప్రచురించారు. 1956 లో ప్రచురించబడిన ఒక నవల ఎనిమిది పునర్ముద్రణలు జరుపుకోవడం రచయిత గొప్పతనమే.

తెన్నేటి సూరి భారతి, ఆంధ్ర పత్రికలలో 1945-1957 లలో పత్రికా రచయితగా పనిచేశాడు. సూరి 1911లో కృష్ణా జిల్లా తెన్నేరులో వెంకట లక్ష్మమ్మ, తండ్రి తిరుమలరావు దంపతులకు జన్మించాడు. పుట్టిన ఊళ్లోనే ప్రాథమిక విద్య పూర్తిచేసి, పై చదువులకి బందరు వెళ్లాడు. అక్కడే సాహిత్య రచనా వ్యాసం గానికి అంకురార్పణ జరిగింది. కొందరు పత్రికాధిపతులతో పరిచయం ఏర్పడింది. వారి మద్దతుతో ఓ ప్రెస్‌లో ఉద్యోగం లభించింది.

1940 దశకంలో స్వాతంత్ర ఉద్యమం ఎగసి పడుతున్న సమయంలో, తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనలో, భుస్వామ్య వ్యవస్థలో,అణచివేతల నేపథ్యంలో చెలరేగిన రైతాంగ పోరాటం చోటుచేసుకున్న తరుణంలో,తన ఇంట్లో అందరూ కాంగ్రెస్ వాదులుగానే ఉన్నా, నిరంకుశత్వం ఎక్కడ ఉన్నా దానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఝళిపించడం తక్షణ కర్తవ్యమని భావించారయన. ఇతర పత్రికల రచనలకు భిన్నంగా, తమ కుటుంబ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా రచన ప్రారంభించాడు. తాను పనిచేసే ప్రెస్‌నే ఒక సాహిత్య వేదికగా, ఒక చర్చా వేదికగా మలుచు కున్నారు.

ప్రెస్‌లో పని చేస్తూనే ఆయా పత్రికలకి వ్యాసాలు రాయడంమొదలు పెట్టాడు. మహిళా చైతనం కోసం పాటలు రాసాడు. ఫాసిజాన్ని ఖండించాడు. పిల్లల కోసం వారి బాణీల్లో పాటలు, బాల గేయాల రాసేవాడు. 'గొడ్లకాడ' అనే నాటకం కూడా రాసి ప్రదర్శించాడు. తెలంగాణ రైతాంగ పోరాటం గురించి ఆంధ్ర ప్రాంతంలో సానుభూతి సంపాదించడం కోసం పాటలు రాసాడు. పని చేస్తున్న ప్రెస్సు మూత పడ్డాక ఆంధ్రపత్రికలో చేరాడు. రచయితగా మన్ననలను పొందాడు. ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధం సంపాదక బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వహించాడు.

ప్రజానాట్య మండలికి ఎన్నో పాటలు రాసి వారికి అందిం చగా, సూరి రాసిన పాటల్ని బుర్రకథల్లో, ఇతర ప్రదర్శన కళా రూపాల్లో ఉపయోగించి, కళాకారులు ఎన్నో పాటలు, కళా రూపాల ద్వారా ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేశారు. సూరి తెలంగాణ రైతాంగ పోరాటంలో ఎంతో ప్రభావితుడయ్యాడు. కలంతోనే కాకుండా గళంతో పాడే పాటల రచయితగా తెలంగాణ పోరాటానికి నోటి పాటలను కంపోజ్ చేసేవాడు. ఆంధ్ర పత్రిక నైజాంలోకి ప్రవేశించేది కాదు. కానీ నోటి పాటలు నిరాఘాటంగా వెళ్ళి వ్యాప్తి పొందేవి. ఆయన పాటలు ప్రజల నోళ్ళలో చిర కాలం నిలిచాయి. సూరి 1958 అక్టోబరు 16న ఈ లోకాన్ని వదిలి వెళ్ళినా, ఆయన పాడిన పాటలు, కూర్చిన బాణీలు నిత్య ఆయన్ని సజీవంగా ఉంచాయి.

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

నామినేషన్ల ప్రక్రియ అంతా ప్రశాంతం...!

నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా ఎస్పీ

ధర్మవరం అక్టోబరు 18(మనం న్యూస్): ధర్మవరం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, బి ఎస్ ఆర్ బాలుర పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, చివరి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని సూచించారు.నామినేషన్ కేంద్రాల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై నిఘా ఉంచాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ సూచించారు. బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎన్నికల అధికారులు, స్థానిక ప్రజలు ఊపిరిపించుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో మీరు పార్టీ అభ్యర్థులు నామినేషన్లను ప్రశాంతమైన పరిస్థితుల్లో అధికారులకు అందజేశారు. నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. ఈ పర్యటనలో అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్, డీఎస్పీ రత్నాకర్ రాజు, సీఐలు రెడ్డప్ప, జయ నాయక్, మొహమ్మద్ అలీ, సునీత, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



యువరాజ్ సింగ్ 19 ఏళ్ల రికార్డు బ్రేక్.. 6 బంతుల్లోనే నమన్ ధీర్ విధ్వంసం



భారత్, వెస్టిండీస్ మధ్య బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన ఐదో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఈ మ్యాచ్‌లో యువ ఆటగాడు నమన్ ధీర్ అద్భుత ప్రదర్శనతో టీమిండియా మాజీ దిగ్గజం యువరాజ్ సింగ్ 19 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. ఈ సిరీస్ రద్దవడంతో స్వదేశంలో వరుసగా 12 సిరీస్‌లు గెలిచిన భారత్ నాలుగేళ్ల విజయాల పరంపరకు అడ్డుకట్ట పడింది. వర్షం తగ్గిన తర్వాత చిన్నస్వామి స్టేడియంలోని అద్భుతమైన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా మ్యాచ్‌ను వెంటనే 9 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచిన వెస్టిండీస్ బౌలింగ్ ఎంచుకోగా, కేవలం 7.4 ఓవర్ల పాటు మాత్రమే ఆట సాధ్యమైంది. ఈ తక్కువ సమయంలోనే భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ఇషాన్ కిషన్ కేవలం 10 బంతుల్లో 2 సిక్సర్లతో 30 పరుగులు చేయగా, నమన్ ధీర్ కేవలం 6 బంతుల్లోనే 3 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 పరుగులు బాదాడు. దీంతో భారత్ 5 వికెట్ల నష్టానికి 118 పరుగులు సాధించింది.

ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో నమన్ ధీర్.. 2007 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై ఇషాన్ కిషన్, దినేష్ కార్తీక్ వంటి వారి పేరిట ఉన్న రికార్డులను వెనక్కి నెట్టాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో కనీసం 5 లేదా అంతకంటే ఎక్కువ బంతులు ఆడిన భారత బ్యాటర్ల జాబితాలో నమన్ ధీర్ ఇప్పుడు నంబర్-వన్ స్థానానికి చేరుకున్నాడు. అంతకుముందు ఈ రికార్డు ఉమ్మడిగా యువరాజ్ సింగ్ (2007లో ఇంగ్లండ్‌పై 16 బంతుల్లో 362.5 స్ట్రైక్ రేట్‌తో 58 పరుగులు), దినేష్ కార్తీక్ (2018లో బంగ్లాదేశ్‌పై నిదాహస్ ట్రోఫీ ఫైనల్‌లో 8 బంతుల్లో 362.5 స్ట్రైక్ రేట్‌తో 29 పరుగులు) పేరిట ఉండేది. ఇప్పుడు టెస్టు హోదా ఉన్న దేశాల్లో కనీసం 6 బంతులు ఆడి 400 లేదా అంతకంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధించిన సెలెక్టెడ్ బ్యాటర్ల జాబితాలో నమన్ ధీర్ చోటు సంపాదించుకున్నాడు.

బ్యాడ్మింటన్‌లో బోణీ

సెమీస్‌లో మానసి జోడీ • భారత్‌కు పతకం ఖాయం

ఆసియా పారా క్రీడలు ఆరంభానికి ముందే భారత్‌కు పతకం ఖాయమైంది. పారా షట్లర్ల జోడీ మానసి జోషి, తులసిమతి మురుగేశన్ సెమీస్ చేరారు. ఆసియా పారా క్రీడలు ఆదివారం ప్రారంభం కానుండగా.. కొన్ని క్రీడల్లో గ్రూప్ మ్యాచ్‌లు ఇప్పటికే మొదలయ్యాయి. శనివారం పారా బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో మానసి, తులసిమతి ద్వయం 21-10, 21-17తో యుమెయ్ లియు, టాంగ్‌టాంగ్ (చైనా) జంటను ఓడించి దేశానికి పతకం ఖాయం చేసింది. టోక్యో పారాలింపిక్స్ విజేత కృష్ణ నగర్ వరుసగా రెండో విజయం అందుకున్నాడు. పురుషుల సింగిల్స్‌లో అతడు క్వార్టర్స్ బెర్తు ఖాయం చేసుకున్నాడు. కృష్ణ 21-13, 21-15తో సుభాన్ (ఇండోనేసియా)ను చిత్తు చేసి, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. నితేశ్ కుమార్ 21-6, 21-7తో చామ్‌నాన్వెట్ (థాయ్‌లాండ్)పై, ప్రమోద్ భగత్ 21-17, 21-16తో షియాంగ్ (చైనా)పై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో నిత్య శ్రీ 21-18, 21-13తో లిన్ షాంగ్‌బావొ (చైనా)ను ఓడించింది. సింగిల్స్‌లో మానసి 3-21, 3-21తో షినో (జపాన్) చేతిలో చిత్తయింది. పురుషుల డబుల్స్‌లో సూర్యకాంత్, నవీన్ జోడీ 21-7, 21-19తో మింగ్‌పన్ లి, షియాంగ్ లిచువాన్ (చైనా) జంటపై పైచేయి సాధించింది.





శ్రేయస్ అయ్యర్‌కు ఇంపాక్ట్ ప్లేయర్ అవార్డు

వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అదరగొట్టాడు. బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ ఆకట్టుకున్న అతడికి టీమ్ మేనేజ్‌మెంట్ అరుదైన గుర్తింపునిచ్చింది. ఐదు టీ20ల సిరీస్‌లో అత్యంత ప్రభావవంతమైన ఆటగాడిగా నిలిచిన శ్రేయస్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' మెడల్‌ను అందించింది. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ ఆదివారం విడుదల చేసింది. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వెస్టిండీస్‌తో సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ బ్యాట్‌తో పరుగుల వరద పారించాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో 181 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో నిలిచాడు. 45.25 సగటుతో పాటు 205.68 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధించాడు. లఖ్‌నవూ వేదికగా జరిగిన తొలి టీ20లోనే శ్రేయస్ తన తొలి అంతర్జాతీయ టీ20 సెంచరీని నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు సాధించిన ఏడో భారత పురుష క్రికెటర్‌గా అరుదైన ఘనత అందుకున్నాడు.సిరీస్ ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో టీమిండియా ట్రైనింగ్ అసిస్టెంట్ నువాన్ సేనవిరత్నే.. శ్రేయస్‌కు మెడల్‌ను అందించాడు. మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు చేసిన కొద్దిమంది భారత ఆటగాళ్లలో శ్రేయస్ ఒకడని, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో జట్టు ముందుండి నడిపించాడని ఈ సందర్భంగా ప్రశంసించాడు.

ఈ వీడియోను బీసీసీఐ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది. వర్షం, పరుగులు, డ్రెస్సింగ్ రూమ్ సందడి.. ఇలా సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ చుట్టూ జరిగిన విశేషాలను వీడియోలో చూపించింది. ఇదిలా ఉంటే, భారత్-వెస్టిండీస్ ఐదు టీ20ల సిరీస్ సమం అయిన సంగతి తెలిసిందే.

చిన్నతనంలో ఎదుర్కొన్న అనుభవాలే వాస్తవాన్నేర్పించాయి

సన్నీ లియోన్ ఎమోషనల్



బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ సన్నీలియోన్ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు చేస్తూ దూసుకెళ్తున్న ఈ భామ.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తన కెరీర్ తొలినాళ్ల కష్టాలు, చిన్ననాటి ఆర్థిక సమస్యల గురించి మాట్లాడుతూ.. జీవితంలో సక్సెస్ సాధించడానికి ఎలాంటి షార్ట్‌కట్‌లు ఉండవని, కేవలం కష్టపడటం వల్ల మాత్రమే అనుకున్నది సాధించగలమని ఆమె స్పష్టం చేశారు. చిన్న వయసులోనే తాను ఎదుర్కొన్న అనుభవాలే తనకు ఈ వాస్తవాన్నేర్పించాయని తెలిపారు. చిన్నతనంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నానని, సమాజంలో రకరకాల విమర్శలను భరించానని సన్నీలియోన్ గుర్తుచేసుకున్నారు.కేవలం 7, 8 ఏళ్ల వయసులోనే తాను డబ్బు సంపాదించడం కోసం చిన్నచిన్న పనులు చేయడం మొదలుపెట్టినట్లు చెప్పారు. ఇంటింటికీ వెళ్లి వస్తువులు అమ్మడం, మంచును శుభ్రం చేయడం, పలు స్టాళ్లు పెట్టడం లాంటి ఎన్నో పనులు చేశానని తెలిపారు. అంత చిన్నవయసులో కష్టపడినా పెద్దగా డబ్బులు వచ్చేవి కాదని, కేవలం ఒక చాక్‌లెట్ లేదా క్యాండీ కొనుక్కునేంత మాత్రమే దొరికేవని ఆమె చెప్పారు. అయినప్పటికీ, కష్టపడి పనిచేస్తేనే ఫలితం ఉంటుందనే నమ్మకం అప్పుడే తనలో బలపడిందని అన్నారు. జీవితంలో గడ్డు పరిస్థితులు ఎదురైనప్పుడు గతంలో ఎన్నడూ ఊహించని కొన్ని కఠిన నిర్ణయాలు కూడా తీసుకోవాల్సి వచ్చిందని ఆమె ఎమోషనల్ అయ్యారు.

ఆ సినిమాతో నా కల నెరవేరింది: పూర్ణ

సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి పూర్ణ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో ఆమె చేసిన డ్యాన్స్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇంతటి భారీ ప్రాజెక్టులో తనకు అవకాశం ఇచ్చిన దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్, నిర్మాత కళానిధి మారన్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌కు ఆమె ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు.''రజనీకాంత్‌తో కలిసి స్క్రీన్ పంచుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. నాకు ఆ అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఏళ్ల తరబడి ఆయనకు వీరాభిమానిని. ఆయన నటించిన 'పడయప్ప' (తెలుగులో నరసింహ) నాకు ఎంతో ఇష్టమైన సినిమా. జైలర్ 2 వంటి భారీ ప్రాజెక్టులో ఇంత మంచి పాట చేసే అవకాశం వస్తుందని అనుకోలేదు. ప్రేక్షకుల స్పందన చూసి.. వారికి కతజ్ఞతలు చెప్పేందుకు సినిమా విడుదల కోసం ఇన్నిరోజులు ఎదురుచూశాను. మన కష్టం, పని పట్ల ఉన్న అంకితభావానికి ఎప్పటికైనా తగిన ఫలితం దక్కుతుందని అందరూ అంటుంటారు. ఇప్పుడు నాకు అలాంటి ఫలితమే దక్కింది'' అని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. ఇక, 'జైలర్ 2'లో వచ్చే 'అల బోలెలో' అనే ప్రత్యేక పాటలో ఆమె నర్తించిన విషయం తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా వసూళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రూ.37.10 కోట్లు రాబట్టిన ఈ చిత్రం.. శనివారం రూ.47.80 కోట్ల (నెట్) వసూళ్లు సాధించింది. దీంతో భారత్‌లో ఈ సినిమా నెట్ వసూళ్లు రూ.100 కోట్లు దాటాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా కేవలం మూడు రోజుల్లోనే రూ.317.15 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించి రికార్డుల దిశగా దూసుకుపోతోంది.





'వారణాసి' పోస్ట్‌పోన్ కాలేదట.. ఆ రోజే థియేటర్లలోకి మహేష్-జక్కన్న మూవీ!



సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న గ్లోబల్ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' గురించి సోషల్ మీడియాలో ఏ చిన్న వార్త వచ్చినా క్షణాల్లో వైరల్ అయిపోతుంది. అయితే గత రెండు రోజులుగా ఈ ప్రాజెక్ట్ వాయిదా పడిందంటూ, అనుకున్న సమయానికి థియేటర్లలోకి రావడం లేదంటూ నెట్టింట విపరీతమైన ప్రచారం జరిగింది. దీంతో మహేష్ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా అందుతున్న సమాచారంతో ఆ రూమర్లన్నింటికీ ఒక్క దెబ్బతో తెరపడింది.సినిమా వాయిదా పడిందంటూ వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర యూనిట్ సన్నిహిత వర్గాలు కుండబద్దలు కొట్టాయి. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారమంతా కేవలం పుకార్లేనని స్పష్టం చేశాయి. అసలైన ట్విస్ట్ ఏంటంటే.. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే పూర్తి కావడం విశేషం. ప్రస్తుతం భారీ స్థాయిలో హై-ఎండ్ సీజీఐ, ఇతర పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. రాజమౌళి ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో పకడ్బందీగా చెక్కుతున్నారని టాక్. అన్నింటికంటే ముఖ్యంగా ఈ సినిమా కోసం ఎక్స్‌క్లూజివ్ ఐమ్యాక్స్ రిలీజ్ విండోను కూడా మేకర్స్ లాక్ చేసేశారట. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే 2027 ఏప్రిల్ 7న 'వారణాసి' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రాబోతోందని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో ఐమ్యాక్స్ స్క్రీన్లను బ్లాక్ చేసుకుని మరీ రంగంలోకి దిగుతున్నారంటే జక్కన్న ప్లానింగ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. రిలీజ్ డేట్‌పై ఈ మాత్రం క్లారిటీ రావడంతో సూపర్ స్టార్ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకోవడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా సంబరాలు మొదలెట్టేశారు.


ప్రభాస్ 'స్పిరిట్' మూవీ వాయిదా

కొత్త రిలీజ్ డేట్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'స్పిరిట్'. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ భారీ అప్‌డేట్ బయటకు వచ్చింది. దీని విడుదల తేదీని సందీప్ రెడ్డి వంగా అధికారికంగా ప్రకటించారు. గతంలో ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది (2027) మార్చి 5న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఈ సినిమాను వాయిదా వేస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 2027 అక్టోబర్ 29న దీపావళి పండుగ కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు అందులో స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా దర్శకుడు సందీప్ ఈ విశేషాన్ని పంచుకున్నారు. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. గుల్షన్ కుమార్ సమర్పణలో టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై ఈ మూవీని నిర్మిస్తున్నారు. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, కషన్ కుమార్, ప్రభాకర్ రెడ్డి వంగా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



దుర్గా దేవి అలంకరణతో
భక్తులకు దర్శనం



బేతంచేర్ల అక్టోబర్ 18(మనం న్యూస్): మండల పరిధిలో ఆర్ఎస్ రంగాపురం సమీపంలోని శంభుగా నిలిచిన ప్రముఖ వైష్ణవ నక్షత్రం శ్రీ గణ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానంలో శరణ్నవరాత్రి మహోత్సవాలు డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు ధర్మకర్తల మండలి చైర్మన్ వి. ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరణ్నవరాత్రి మహోత్సవాలు ఏడవ రోజు శ్రీ మహాలక్ష్మి అమ్మవారు శ్రీ దుర్గా దేవి గా భక్తులకు దివ్యదర్శన మిచ్చారపట్టువస్త్రాలు విలువైన ఆభరణాలు రంగురంగుల పుష్పాలతో విశేషంగా అలంకరించిన ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై వేంచేపు చేసి ఆలయ ప్రాంగణంలో వైభవంగా ఊరేగించారు ఈ వేడుకల్లో ధర్మకర్తల మండలి సభ్యులు వేదపండి తులుఅర్చకస్వాములు ఆలయ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండప నిర్మాణం నా బాధ్యత
కళ్యాణ మండపానికి అదనంగా మరో 3 కోట్లు: మంత్రి నిమ్మల



- కృతజ్ఞతలు తెలిపిన సామాజిక వర్గీయులు

పాలకొల్లు, అక్టోబర్ 18,మనం ప్రతినిధి: పాలకొల్లులో గౌడ శెట్టిబలిగా సామాజిక వర్గ కళ్యాణ మండప నిర్మాణ బాధ్యత నాదేనని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానంటే ఎస్సీ బీసీలేనని అందులోనూ గౌడ శెట్టిబలిజ సామాజిక వర్గీయులు ప్రధానమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మీ రుణం తీర్చుకునేలా పనిచేస్తున్నానని తెలిపారు.

పాలకొల్లు లో గౌడ శెట్టిబలిజ సామాజిక వర్గీయుల చిరకాల స్వప్నమైన కళ్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఆ సామాజిక వర్గ నాయకులు కొనియాడారు. పాలకొల్లులోని గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండప నిర్మాణానికి గత టిడిపి ప్రభుత్వంలో కోటి 50 లక్షలు , కూటమి ప్రభుత్వ రెండేళ్లలో రెండు విడతలగా రూ ఆరు కోట్లు కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.7.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ, పెద్ద సంఖ్యలో సామాజిక వర్గీయులు పట్టణంలోని మంత్రి కార్యాలయానికి చేరుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు సంఘ నాయకులు మామిడి శెట్టి పెద్దిరాజు, కోడి విజయభాస్కర్ , అంగర చిన్న, కడలి గోపాలరావు, గుబ్బల వేణు, బొక్క గంగాధర్ రావు, మహేష్, చిట్టూరి ఏడుకొండలు తదితరులు సాలు కప్పి ఘనంగా సత్కరించారు. తమ సామాజిక వర్గ అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించడం, అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలకు తిరిగి నిధులు సమకూర్చడం అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని పేర్కొన్నారు. తమ వర్గం తరపున మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ సామాజిక అభివృద్ధికి సహకరించాలని కోరారు.కళ్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు

క్రీడల పట్ల కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్
ప్రత్యేక కృషి అభినందనీయం



- మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు, అక్టోబర్ 18,మనం ప్రతి నిధి: క్రీడల పట్ల కాస్మోకల్చరల్ స్పోరట్స్ కాంప్లెక్స్ ప్రత్యేక శ్రద్ధ వహించడం ఆనందదాయకమని, ఇందుకు చైర్మన్ గొట్టముక్కల గాంధీ భగవాన్ రాజు తీసుకున్న శ్రద్ధ అభినందనీయమని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పాలకొల్లు కాస్మోకల్చరల్ స్పోరట్స్ కాంప్లెక్స్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిహెచ్ బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ క్వాలిఫైడ్ పోటీల విజేతల బహుమతి ప్రధానోత్సవ సభకు మంత్రి రామానాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బుద్ధావతారం రాజుతో తనకు చక్కటి అనుబంధం ఉందని, ఆయన ఈ లోకంలో లేకున్నా, ఎప్పటికీ మనందరి గుండెల్లోనూ జీవించే ఉంటారని అన్నారు. కాస్మో కల్చరల్ స్పోరట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ తమ సంస్థ, క్రీడలకు విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఎన్నో సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. క్రీడల్లో పాల్గొని సహకరించిన క్రీడాకారులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. 45, 55, 65, 70 సింగిల్స్ విభాగంలో ఫస్ట్ రౌండ్ లో 48 మంది విజయం సాధించినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భూన్ రాజు తెలిపారు. కాస్మో కల్చరల్ స్పోరట్స్ కాంప్లెక్స్ కోర్టులో 45 సంవత్సరాల పైబడిన క్రీడాకారులు, టౌన్ హాల్లో కోర్టులో 70 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు, నరసాపురం ఆఫీసర్స్ క్లబ్ కోర్టులో 55, 65 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ క్వాలిఫైడ్ పోటీలలో పాల్గొనడం విశేషం. మంత్రి కాసేపు టెన్నిస్ ఆడి అందరిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు రాజు, డాక్టర్ కె ఎస్ పి ఎన్ వర్మ, జీవి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ రేసులో యువనాయకుడు కోన కుమార్ నాయుడు!

- కొయ్యలగూడెం నుంచి కూటమి అభ్యర్థిగా అవకాశం?



కొయ్యలగూడెం, అక్టోబరు 18, మనం ప్రతినిధి: కొయ్యలగూడెం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. జడ్పీటీసీ స్థానం జనరల్ కేటగిరీకి కేటాయించడంతో పలువురు ఆశావహులు అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజవరం గ్రామానికి చెందిన యువ నాయకుడు కోన కుమార్ నాయుడు పేరు కూటమి రాజకీయ వర్గాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీతో అనుబంధం కొనసాగిస్తున్న ఆయన, 2024 పోలవరం నియోజకవర్గ ఎన్నికల్లో పార్టీ విజయానికి క్షేత్రస్థాయిలో కృషి చేసినట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గంలోని ఏడు మండలాల నాయకులతో పరిచయాలు ఉండటం ఆయనకు కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు.

యువ నాయకత్వానికి అవకాశం దక్కేనా?

స్థానిక సమస్యలపై అవగాహన, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యం నేపథ్యంలో కోన కుమార్ నాయుడుకు అవకాశం దక్కుతుందా అన్న చర్చ సాగుతోంది. మరోవైపు జడ్పీటీసీ అభ్యర్థిత్వం కోసం పలువురు ఆశావహులు ప్రయత్నిస్తుండటంతో కూటమి నిర్ణయం కీలకంగా మారింది. సామాజిక సమీకరణాలు, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం ఆధారంగా అభ్యర్థి ఎంపిక జరిగే అవకాశం ఉంది. తుది నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

కూటమి నిర్ణయంపై ఉత్కంఠ

జడ్పీటీసీ అభ్యర్థి ఎంపికలో భాగస్వామ్య పార్టీల సమన్వయం, సామాజిక సమీకరణాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు కీలకం కానున్నాయి. యువ నాయకత్వానికి అవకాశం కల్పించాలనే అభిప్రాయాల నేపథ్యంలో కోన కుమార్ నాయుడుకు అభ్యర్థిత్వం దక్కుతుందా? లేక ఇతర ఆశావహులకు అవకాశం లభిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉండటంతో కూటమి శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కృషి

జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీతో అనుబంధం కొనసాగిస్తున్న కోన కుమార్ నాయుడు, 2024 ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గంలో పార్టీ విజయానికి క్షేత్రస్థాయిలో కృషి చేసినట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గంలోని ఏడు మండలాల నాయకులతో పరిచయాలు ఉండటం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ఆయనకు అనుకూల అంశాలుగా భావిస్తున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా
నిర్వహిద్దాం !



తాడేపల్లిగూడెం అక్టోబర్ 18 (మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తాడేపల్లిగూడెం మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏవి సూరిబాబు కోరారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళి వాటికి సంబంధించి అవగాహన కల్పించారు. అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్లు ఎంపీటీసీ జడ్పీటీసీ అభ్యర్థుల నుంచి నామినేషన్ స్వీకరించబడతాయని తెలియజేశారు. నామినేషన్ల దాఖలకు సంబంధించి ఏ పత్రాలు సమర్పించాలి అనే వాటి పై నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి చంద్రశేఖర్, ఎస్సై రవికుమార్, ఏ ఎస్ డబ్ల్యూ రామాంజనేయ రాజు, ఏవో ఆకుల సూరిబాబు పాల్గొన్నారు.

బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిసిన మాగంటి బాబు



తాడేపల్లిగూడెం అక్టోబర్ 18 (మనం న్యూస్)ః తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ పార్లమెంట్ సభ్యులు మాగంటి బాబు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర ప్రగతి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించుకున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.అనంతరం మాగంటి బాబు శాలువాతో సత్కరించి గౌరవించారు.

ఎన్నికల వ్యయంపై నిరంతర నిఘా ఉంచాలి



- అభ్యర్థుల ఖర్చుల వివరాలను నిశితంగా పరిశీలించాలి
- విశాఖ ఎన్నికల వ్యయ పరిశీలకులు పి. వెంకట సందీప్ రెడ్డి ఐ.ఎఫ్.ఎస్

విశాఖపట్నం, అక్టోబర్ 18: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యయ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని వ్యయ పరిశీలకులు పి. వెంకట సందీప్ రెడ్డి అధికారులకు సూచించారు. జీవీఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో 21 ఎన్నికల సర్కిళ్ల అసిస్టెంట్ ఎక్స్పెండీచర్ అబ్జర్వర్లతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ, లెక్కల నమోదు, నిబంధనల అమలుపై దిశానిర్దేశం చేశారు. కార్పొరేటర్ అభ్యర్థులు గరిష్టంగా రూ.15 లక్షలు, మేయర్ అభ్యర్థులు రూ.40 లక్షల వరకు మాత్రమే ఎన్నికల కోసం ఖర్చు చేయాలని తెలిపారు. నగదు, మద్యం, బహుమతుల పంపిణీతో పాటు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అన్ని రకాల ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, పెయిడ్ న్యూస్, సోషల్ మీడియాలో ప్రచారమయ్యే ఎన్నికల సంబంధిత అంశాలను నిశితంగా పరిశీలించి, సంబంధిత వ్యయాలను నమోదు చేయాలని సూచించారు.

జీవీఎంసీ చట్టంలోని సెక్షన్ 20(బి) ప్రకారం ఎన్నికల వ్యయానికి సంబంధించిన లెక్కలను నిర్దేశిత విధానంలో నిర్వహించి, సంబంధిత అధికారులకు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల వ్యయ వివరాలను సమర్పించని లేదా నిబంధనలను ఉల్లంఘించిన అభ్యర్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈలి ఆంజనేయులు సేవలు అభినందనీయం



తాడేపల్లిగూడెం అక్టోబర్ 18 (మనం న్యూస్): తాడేపల్లిగూడెం రూపశిల్పి, అమరజీవి , మాజీ మంత్రి ఈలి ఆంజనేయులు శత జయంతి ఉత్సవం ఆయన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిగూడెంలో జరిగింది, ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి , వైసిపి ఇన్చార్జి వడ్డీ రఘురాం నాయుడు , టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామిలు మాట్లాడుతూ ఈలి ఆంజనేయులు సేవలు అభినందనీయమని కొనియాడారు.తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ సెంటర్ వద్ద దివంగత నేత మాజీ మంత్రి యాలి ఆంజనేయులు 100వ జయంతి ఉత్సవాలు. తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి యాలి ఆంజనేయులు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాలి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ప్రముఖులు ఆటో డ్రైవర్ లకు యూనిఫాం పంపిణీ చేసారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేశారు అనేకమంది పాల్గొన్నారు.

ముగిసిన స్థానిక ఎన్నికల అభ్యర్థుల నామినేషన్లు

- కౌన్సిల్ నామినేషన్ అభ్యర్థులు 160
- చైర్మన్ నామినేషన్లు అభ్యర్థులు 16



బేతంచేర్ల అక్టోబర్ 18 (మనం న్యూస్): ముగిసిన స్థానిక ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ లు పట్టణంలో 28వార్డుల కౌన్సిల్ అభ్యర్థులు చైర్మన్ అభ్యర్థి నామినేషన్లు 16 నుండి 18 వరకు మూడు రోజులు నామినేషన్లు వేశారు మూడు రోజుల నామినేషన్ వార్డు కౌన్సిల్ పార్టీ అభ్యర్థులు తెలుగుదేశం కౌన్సిల్ అభ్యర్థులు52 వైఎస్ఆర్సిపి 86 బిజెపి 3 సిపిఎం 3 సిపిఐ 3 జనసేన 6 ఇండిపెండెంట్ గా 7 అభ్యర్థులు నామినేషన్ వేశారు చైర్మన్ అభ్యర్థులు టిడిపి 8 వైయస్సార్సీపి 5 ఇండిపెండెంట్ గా 3 వార్డు కౌన్సిల్ 160 చైర్మన్ నామినేషన్ 16 దాఖలైనట్టు ఎన్నికల అధికారి కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు నామినేషన్ లు సీఐ వెంకటేశ్వర రావు ఎస్సై రమేష్ బాబు అధికార ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లు నగర పంచాయతీ కార్యాలయం వద్ద పోలీస్ సిబ్బందితో ప్రత్యేక నిగతో అవాంఛనీయులు జరగకుండా ప్రశాంతంగా నామినేషన్లు ప్రక్రియ పూర్తి

జలాశయాల పరిరక్షణ మనందరి బాధ్యత




విశాఖపట్నంఅక్టోబర్ 18 (మనం న్యూస్): మనకు జీవనాధారమైన జలవనరులను పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు పిలుపునిచ్చారు. జలాశయాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనాలు, చెత్తాచెదారం వేయడం వల్ల తాగునీరు కలుషితమవడంతోపాటు, జలచరాల మనుగడకు ముప్పు ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

విశాఖపట్నంలోని మేఘాద్రి గెడ్డ జలాశయం (డ్యామ్) లోపల, చుట్టుపక్కల పరిసరాల్లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు సింహాద్రి టీఎంటీ, హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్, స్థానిక యువత ఆధ్వర్యంలో జలాశయ శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు మాట్లాడుతూ, నీరు లేనిదే జీవం లేదనే ఉన్నత ఆశయంతో మన పూర్వీకులు నదులను, జలాశయాలను పవిత్రమైన క్షేత్రాలుగా భావించి గౌరవించేవారని గుర్తుచేశారు.

నీరు లేనిదే జీవం లేదు. మనకు జీవనాధారమైన తాగునీటిని అందించే జలాశయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత. వాటిని ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనాలు, చెత్తాచెదారంతో కలుషితం చేయడం వల్ల ప్రజల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం కలుగుతుంది అని పి.ఎస్. నాయుడు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు




- అనకాపల్లి డీఎస్పీ పి.వి.వి.నరసింహారావు

అనకాపల్లి పట్టణం,మనం న్యూస్ అక్టోబర్ 18: స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా మరియు పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా అనకాపల్లి సబ్-డివిజన్ పరిధిలో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ పి.వి.వి. నరసింహారావు తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనల ప్రకారం శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు తేది.14.10.2026 నుంచి క్షేత్రస్థాయిలో అమల్లోకి వచ్చాయని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఆయన జారీ చేసిన కీలక ఆదేశాలు మరియు మార్గదర్శకాలు

సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు:ఈ అనకాపల్లి డివిజన్ వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది. పోలీస్ శాఖ నుంచి ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు నిర్వహించడం లేదా మైక్ సెట్లు/లౌడ్స్పీకర్లు వినియోగించడం చట్టరీత్యా నేరం. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ():ఈ గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు మరియు కార్యకర్తలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని తు.చ. తప్పకుండా పాటించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై అనధికారిక ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడ రాతలను అనుమతించబోము.

వైభవంగా దుర్గామాత పూజ



మంథని అక్టోబర్18(మనం న్యూస్): మంథని డిపో కార్మికుల సహకారంతో ప్రతి సంవత్సరం మంథని డిపో ప్రాంగణంలో దుర్గామాత గుడి వద్ద దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డిపో అధికారులు సిబ్బంది నాయకులు కలిసి పెద్ద ఎత్తున దుర్గ మాత దేవి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ దుర్గామాత పూజా కార్యక్రమంలో భారీ సంఖ్యలో మంథని డిపో కార్మికులు, అధికారులు సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈపూజా కార్యక్రమంలో మంథని డిపో మేనేజర్ జ్ఞానేశ్వర్, ఎస్.టిఐవర్జిలాల్, అసిస్టెంట్ మెకానిక్ ఫోర్ మెన్ వెంకటేశ్వర్లు, మంథని డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి, మునీర్,రమేష్, గ్యారేజ్ సెక్రెటరీ కృష్ణ, శ్రీనివాస్,విజయ్,మెకానిక్ విజయ్, కుమార్, ఎంప్లాయిస్ యూనియన్ సెక్రెటరీ గంధం రమేష్, రాజబాబు,సెక్యూరిటీ కానిస్టేబుల్ రాకేష్, నందిసాగర్. మంత్రిపోచయ్య, వెంకటస్వామి, సతీష్, ఏడిసిలు ఎన్.అంజయ్య, ఎం.రాములు తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వంలో కళలకు, కళాకారులకు అత్యున్నత ప్రాధాన్యత: సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్



రాజమహేంద్రవరం,అక్టోబర్,18,(మనం న్యూస్): ఏ సమాజంలోనైతే కళలు, కళాకారులు తగిన రీతిలో గౌరవించబడతారో, ఆ సమాజం వేగంగా ప్రగతి పథంలో పయనిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు స్మారక ప్రభుత్వ ఆర్ట్ గ్యాలరీలో 'భగీరథి ఆర్ట్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 'భగీరథి - అద్వితీయ ప్రకృతి చిత్రకారుడు' పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాహిత్యం, కళారంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులకు 'మెమోరియల్ స్పెషల్ అవార్డ్స్ - 2026' ను ప్రధానం చేసి అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కళాకారులకు పెద్దపీట వేస్తోంది. ఉగాది కళారత్న పురస్కారాలతో పాటు మహాకవులు, ప్రముఖ రచయితలైన గుర్రం జాషువా, బోయి భీమన్న, గిడుగు రామమూర్తి పంతులు వంటి మహనీయుల పేరిట అధికారిక పురస్కారాలను అందజేస్తున్నాం. 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అని చాటిచెప్పిన యుగకర్త గురుజాడ వెంకట అప్పారావు జయంతిని రాష్ట్ర అధికారిక పండుగగా ప్రకటించాం. విజయనగరంలోని ఆయన నివాసాన్ని సర్వాంగ సుందరమైన ఆడిటోరియంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. సమాజ శ్రేయస్సుకు దోహదపడిన ఎందరో లబ్ధప్రతిష్టుల జయంతులను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తూ, వారి ఆశయాలను భవిష్యత్ తరాలకు అందిస్తోందన్నారు.

గతంలో తన తాతగారు రాజమహేంద్రవరం మున్సిపల్ చైర్మన్గా సేవలందించిన రోజులను మంత్రి దుర్గేష్ స్మరించుకున్నారు. ఆ రోజుల్లో కళాప్రపూర్ణ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ 'అసలు సిసలైన శ్రేయోభిలాషి చేతిలో రాజమహేంద్రవరం మున్సిపల్ పీఠం ఉందట' అని కొనియాడిన మాటలు తనకు ఇప్పటికీ ఎంతో ప్రేరణనిస్తాయని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భగీరథి ఆర్ట్ ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలు, కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గాదేవి అలంకారంలో శ్రీ సుంకులా పరమేశ్వరి అమ్మవారు!

ఎనిమిదో రోజు నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, చండీ హోమాలు

భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు.. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి



గూడూరు , అక్టోబర్ 18 (మనం న్యూస్): కర్నూలు జిల్లా గూడూరు మండలం కే. నాగలాపురం గ్రామంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ సుంకులా పరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం ఉదయం చండీ హోమాలు, శాంతి హోమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి అమ్మవారిని దుర్గాదేవి అలంకారంలో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో వేదమంత్రోచ్చారణల నడుమ హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామ ప్రజలు, భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

పాల్గొన్న ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ, ఆలయ వైస్ చైర్మన్ గోపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తలారి సుజాత, బండారి లక్ష్మీదేవి, కురువ వెంకట రాముడు, ఎం. లక్ష్మీదేవి, సి. మద్దమ్మ, ఎరకలి మద్దమ్మ పాల్గొన్నారు. అలాగే ఆలయ అర్చకుడు వెంకటేష్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, ఆలయ సిబ్బంది కేశవ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నవరాత్రి ఉత్సవాలు భక్తిమయ వాతావరణంలో కొనసాగుతున్నాయి.

ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి



కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, బాధ్యతలపై సంబంధిత సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని కర్నూలు జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్ అన్నారు. ఆదివారం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్)లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను, అలాగే వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ స్థాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం, ఇందిరాగాంధీ నగర్లోని 59, 60, 61 వార్డుల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలను అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులు, బాధ్యతలను ఎన్నికల సంఘం హ్యాండ్బుక్ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు అందించిన శిక్షణలో వివరించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు.చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఎన్నికల విధులను ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తూ, పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అథెనా స్కూల్లో బ్యాలెట్ బాక్సులను తీసుకొని, పోలింగ్ కేంద్రాల్లో ఉపయోగించి తిరిగి అప్పగించేంత వరకు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సామగ్రి వినియోగం, పోలింగ్ నిర్వహణ, ఎన్నికల విధివిధానాలపై పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో మేయర్ స్థాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వేణుగోపాల్, 59, 60, 61 వార్డుల రిటర్నింగ్ అధికారి ఐ.డి. శిరీష, తదితరులు పాల్గొన్నారు.

జన సేన పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలి

జనసేన పార్టీ ఇన్చార్జ్ వాల్మీకి లక్ష్మన్న



మంత్రాలయం అక్టోబర్ 18(మనం న్యూస్); కూటమి పార్టీలో పొత్తులో భాగంగా మంత్రాలయం నియోజకవర్గం లో స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీకి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలలో సీట్లు సర్దుబాటు చేసి జనసేన కార్యకర్తలకు సీట్ల కేటాయించాలని మంత్రాలయం నియోజకవర్గం జనసేన ఇన్చార్జి లక్ష్మణ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోనే నాలుగు మండలాల నుంచి జనసేన పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ కోటా ప్రకారం జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల పదవుల జనసేన పార్టీ కి ఎన్డీఏ కూటమిలో సీట్లు కేటాయించాలని కోరారు. త్వరలో కూటమి తెదేపా, జనసేనా, బాజాపా ఇన్చార్జులు సమావేశం జరుగుతుందని ఈ సమావేశంలో జనసేన పార్టీకి సీట్లు కేటాయించడం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జన సేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి లక్ష్మణ్ను నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

ఈ సమావేశంలో కర్నూలు పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యులు రామాంజనేయులు, కర్నూల్ పార్లమెంటు నిర్వాహక దళ్ సభ్యులు సభ్యులు చిన్న, పెద్దకడబూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బజారప్ప, ఉపాధ్యక్షులు ఆలీ భాష, కోసిగి మండల అధ్యక్షులు వీరారెడ్డి, మంత్రాలయం మండల అధ్యక్షులు బివి రవిచంద్ర, జనసేన పార్టీ కౌతాళం మండల నాయకులు ఈరన్న, ఈరన్న, ఎరి స్వామి, రాంప్రసాద్, ఎస్ నాగరాజు, టీ నాగరాజ్, కుమ్మలూరు బసవ,మంత్రాలయం మండలం భీమన్న, బొజ్జ మోహన్, బీరప్ప, రంగస్వామి నాయక్, వెంకటేష్ నాయక్, కోసిగి మండలం నుంచి మండల నాయకులు గొండ్ల చంద్ర, కే నాగరాజ్, శివారెడ్డి, సి నాగేష్, ఐటీ ఇన్చార్జ్ ఆర్ రమేష్, సి నాగేష్, పంతం నరసింహులు, పీరా బాబు, పెద్దకడబూరు మండలం నుంచి సుభాన్, హుసేని, జయపాల్ ఆనంద్, లింగప్ప పాల్గొన్నారు.

టిడిపి నుంచి వైసీపీలోకి చేరిక

ఎమ్మెల్యే విరుపాక్షి సమక్షంలో చేరిన పీ కోటకొండ గ్రామస్తులు



దేవనకొండ, అక్టోబర్ 18(మనం న్యూస్): దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన సుమారు 100 కుటుంబాలు టిడిపి పార్టీ నుండి వైసీపీ పార్టీలోకి ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సమక్షంలో ఆదివారం చేరినట్లు మండల వైసిపి నాయకుడు కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు విలేకరులకు తెలిపారు. ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆర్. హనుమంత రెడ్డి, మీనుగ కృష్ణ, అల్లం కొండ మాజీ ఎంపీటీసీ రంగడు, లక్ష్మణ స్వామి, ముచ్చు రామచంద్ర, కుమార్ మరి కొంతమంది సహకారంతో గ్రామంలోని టిడిపికి చెందిన లక్ష్మీనారాయణ, రాజేష్, మాజీ ఎంపిటిసి కొలుట్లయ్యతో పాటు 100 కుటుంబాలు వైసీపీలోకి చేరినట్లు తెలిపారు. మండలంలో వైసిపి పార్టీ అభివృద్ధికి మరింత కృషిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

జ్ఞానోత్సవ పరీక్షలో విజేతలకు బహుమతులు

బేతంచేర్ల అక్టోబర్ 18(మనం న్యూస్): పట్టణం లో అమ్మవారి శాలలో ఆర్యవైశ్య సంఘం పట్టణం లో ఉన్న ఆర్యవైశ్య వారు దసరా శరన్నవరాత్రులు సందర్భంగా నిర్వహించిన జ్ఞానోత్సవ పరీక్ష రాసిన విద్యార్థిని విద్యార్థులుఅనుముల అభిమన్యు గుప్తా మతి విజయలక్ష్మి మరియు రాజా శ్రీరామ్ సహకారంతో 35 మంది చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మట్టా రాజేష్ కుమార్ కార్యదర్శి కుప్ప శ్రీనివాస్ కోశాధికారి బచ్చు లక్ష్మీనారాయణ మరియు గౌరవ అధ్యక్షులు కందగడ్డల జనార్ధన్ కొప్పరపు శేష మోహన్



అనుముల సురేష్ బాబు మారం విష్ణు ప్రవీణ్ మట్టా రామచంద్రయ మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

మహిషాశుర మర్దినిగా కామేశ్వరి అమ్మవారు



మహానంది, అక్టోబర్18,మనంన్యూస్: మహిషాశుర మర్దినిగా శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవి నవరాత్రులలో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం యగశాలలో దాతలు పాల్గొనగా ఈఓ శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాం బట్,హనుమంతు శర్మల ఆధ్వర్యంలో ఋత్వికులు, అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, దీక్షాధారణ, ఋత్వీక్వారున, అఖండ దీప స్థాపన, అగ్నిప్రతిష్టాపన, నవదుర్గ కలశ స్థాపన, తదితర పూజలను నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహణం పై శ్రీ మహాగౌరి దుర్గ అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, నీలఖంటేశ్వర రాజు,సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, ఆలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సరస్ మేళాలో సందర్శకుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

ఆదివారం సెలవు దినం కావటంతో మేళాకు విశేష స్పందన

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్.

విజయవాడ,అక్టోబర్, 18,(మనం న్యూస్): కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తో కలిసి సందర్శించారు. విజయవాడ పున్నమి ఘాట్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక జాతీయ 'సరస్ మేళా' ప్రాంగణాన్ని ఆదివారం స్థానిక మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించిన అనంతరం మంత్రి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ... మొదటిసారి ఢిల్లీ వెలుపల విజయవాడలో ఇంత భారీ ఎత్తున సరస్ మేళా నిర్వహిస్తుండటం గర్వకారణమని పేర్కొన్నారు. సందర్శకులు, వ్యాపారులకు కల్పిస్తున్న ఏర్పాట్లు, డిజిటల్ చెల్లింపుల కోసం వై-ఫై సదుపాయాలు, పారిశుధ్యం తదితర అంశాలను స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు.

ప్రజల నుంచి విశేష స్పందన

ఆదివారం సెలవు దినం కావడంతో వేల సంఖ్యలో సందర్శకులు మేళాకు తరలివచ్చారని, వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో సందర్శకుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన డ్వాక్రా మహిళల



ఉత్పత్తులకు మంచి వ్యాపారం జరిగి, వారి జీవనోపాధి మరింత మెరుగుపడేలా పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. జాతీయ సరస్ మేళాకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివస్తున్నారని, ప్రస్తుతం వేలాది మంది మేళాను సందర్శిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మేళాలో స్టాళ్లు ఏర్పాటు చేసిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులకు అవసరమైన వైఫై కనెక్టివిటీలో అక్కడక్కడా సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


అలాగే మేళా ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మంచి ప్రచారం లభించడంతో పాటు, వారి వ్యాపార కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అన్ని విధాలా సహకరిస్తామని మంత్రి పేర్కొన్నారు. మేళాకు వస్తున్న సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, మహిళా సంఘాలకు ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

సెర్ప్ డైరెక్టర్ (అడ్మిన్) కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ...

దసరా పండుగ సందర్భంగా జాతీయ సరస్ మేళాకు సందర్శకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ. 3.50 కోట్ల మేర వ్యాపారం జరిగినట్లు వెల్లడించారు.

జాతీయ సరస్ మేళాలో చేనేత, హస్తకళలు, ఆహార ఉత్పత్తుల విభాగాల్లో దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాల్లో మొత్తం 600 స్టాళ్లను మహిళా సంఘాలు, కళాకారులకు ఉచితంగా కేటాయించినట్లు తెలిపారు.

రావణుడి పది తలల ప్రతీకాత్మకత






సీతాపహరణతో సహా రావణుని హేయమైన చర్యలు, ఆయనను ఏమాత్రం మార్పులేని రాక్షసుడిగా నిలబెడతాయి. అందరిలాగే రావణుడు కూడా ఒక సంక్లిష్టమైన వ్యక్తి. అతను తన జీవిత ప్రయాణంలో ప్రతికూల లక్షణాలనే కాకుండా, సానుకూల లక్షణాలను కూడా ప్రదర్శించాడు. నిపుణుడైన యోధుడు, రాజకీయవేత్త, రాజు, అలాగే జ్యోతిష్కుడు, ఆయుర్వేద వైద్యుడు అయిన అతను తన రాజ్యాన్ని ఎంతో శ్రద్ధగా చూసుకున్నాడు. అందుకే అక్కడి ప్రజలలో అత్యంత పేదవారు కూడా సుఖంగా ఉండేవారు, ఎన్నడూ దారిద్ర్యంతో బాధపడలేదు. అసాధారణమైన కవి, పండితుడు కూడా అయిన ఆయనకు తరచుగా చిత్రించే పది తలలలో ప్రతి ఒక్కటి ఆరు శాస్త్రాలకు, నాలుగు వేదాలకు ప్రతీక అని ఆయన పరివర్తనకు దేవుడైన శివునికి ప్రసిద్ధ భక్తుడు. కానీ తన ముందున్న వారిలాగే, తన తర్వాత వచ్చిన వారిలాగే, రావణుడు కూడా భోగాభిలాషలో దారి తప్పి, ఆనందాన్ని వెంబడించే క్రమంలో జీవితంలోని అనేక దుర్గుణాలకు లొంగిపోయాడు. ఈ విధంగా, అధికారంపై ఆకలి పెరిగేకొద్దీ, ఆయన పది జ్ఞానాంశాలు అటువంటి అధికారానికి అతుక్కుపోయిన వారి నుండి వెలువడే పది గుణాలకు ప్రతీకలుగా ప్రసిద్ధి చెందాయి. అవేంటంటే, కామ (కామం), క్రోధ (కోపం), మోహ (భ్రమ), లోభం (దురాశ), మద (గర్వం), మాత్సర్య (అసూయ), బుద్ధి (మేధస్సు), మనస్ (మనస్సు), చిత్త (చేయుట), అహంకారం (అహం).

రావణుడి విషయంలో, సీత అతని ఇంద్రియాలకు వస్తువుగా మారింది. కామంతో నియంత్రించబడి, అతను ఆమెను బలవంతంగా అపహరించాడు, ఆమె అతనితో ఉండటానికి నిరాకరించినప్పుడు కోపించాడు. కోపంతో కళ్ళు మూసుకుపోయి, అతను తన తెలివిని పూర్తిగా కోల్పోయాడు. రావణుడంటే తన ఇంద్రియాలను అదుపు చేసుకోలేక, తన నిజమైన ఆధ్యాత్మిక అస్తిత్వానికి భిన్నమైన మార్గంలో పయనించిన వ్యక్తి అని. అందుకే ఇంద్రియ నిగ్రహంతో ఆధ్యాత్మిక పురోగతి వైపు పయనిస్తే, ఇలాంటి పతనాన్ని నిరోధించడం సుసాధ్యం!

- అభిరామి



మహాజ్ఞాని, కానీ...!

పాఠకులకు 'విజయదశమి' శుభాకాంక్షలు. దసరా పండుగను 'చెడు మీద మంచి సాధించిన విజయానికి' చిహ్నంగా భావిస్తారు. దసరా మనకు ఇద్దరు వ్యక్తుల గురించి తెలియజెబుతుంది. కొన్ని విషయాల్లో చెడ్డవాళ్ళయిన వీళ్ళిద్దరిలో కూడా మరికొన్ని విశిష్ట లక్షణాలు, అంతులేని మేధోశక్తి ఉన్నాయి. కానీ వారి చెడుప్రవర్తన వారిలోని 'మంచి'ని పూర్తిగా మరుగుపరచి, వాళ్ళను దౌష్ట్యానికి ప్రతీకలుగా మార్చింది.

తనతో తాను పోరాడి ఓడిన యోధుడు

దీని గురించి తెలుసుకుందాం!

భారతీయ పురాణాల ఆత్మ కేవలం మంచి చెడులకు అతీతమైనది. లోతుగా పరిశీలిస్తే, ప్రతి అడుగులోనూ ఒక ఆసక్తికరమైన కథ ఉంటుంది. రావణుడు ప్రతినాయకుడి పాత్ర పోషించాడు, కానీ ఆయన ఆ పాత్రను ఎందుకు పోషించాడు అనేది చాలా ముఖ్యమైన ప్రశ్న. నిజానికి, మంచి చెడుల సమీకరణంలో సమతుల్యతను తీసుకురావడానికే రావణుడు ఆ పాత్రను పోషించాడు. అందుకే ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో ఆయనను ఇప్పటికీ పూజిస్తుండటంలో ఆశ్చర్యం లేదు.

రావణుడు భారతీయ పురాణాలలోని గొప్ప ఋషులలో ఒకరైన, సప్తఋషులలో ఒకరైన పులస్త్యుని మనవడు, ఆయన విశ్వావసుడనే మహర్షికి, అసురుని తల్లి అయిన కైకశికి జన్మించాడు. అందువల్ల ఆయనను సగం అసురుడు, సగం బ్రాహ్మణుడుగా పరిగణిస్తారు. ప్రాచీన హిందూ ఇతిహాసం రామాయణంలో రావణుడు ప్రధాన ప్రతినాయకుడిగా ప్రసిద్ధి చెందాడు. ఆయనను ఒక రాక్షసుడిగా, లంకకు గొప్ప రాజుగా చిత్రీకరించారు. ఆయన పది తలల రాక్షసుడిగా ప్రసిద్ధి చెందాడు, కానీ రావణుడు పది తలలతో పుట్టలేదనే విషయం చాలా మందికి తెలియదు. రావణుడు వాస్తవానికి శివ భగవానుడికి గొప్ప భక్తుడు, అపారమైన పండితుడు, అద్భుతమైన పరిపాలకుడు, గొప్ప వైణికుడు. ఆయన రావణ సంహిత (జ్యోతిష్య శాస్త్ర గ్రంథం), అర్క ప్రకాశం (సిద్ధ వైద్య గ్రంథం) అనే రెండు పుస్తకాలను రచించాడు. ఆయుర్వేదం, క్షుద్రవిద్యలలో నిష్ణాతుడు. ఆయన తన ఇష్టానుసారం గ్రహ స్థానాలను నియంత్రించగలడని అంటారు. రావణుడు తన సవతి సోదరుడైన కుబేరుడి నుండి గెలుచుకున్న పుష్పకవిమాన్ని (ఎగిరే రథం) కలిగి ఉండేవాడు. ఆయన తంత్ర విద్యలో (భావాల దృశ్య భ్రమలను సృష్టించే శాస్త్రం) ప్రావీణ్యం సంపాదించి, దానిని తన శత్రువులతో జరిగిన యుద్ధాలలో ఉపయోగించాడు.

ఒకసారి రావణుడు కైలాస పర్వతాన్ని ఎత్తడానికి ప్రయత్నించినప్పుడు, శివుడు అతని నుదుటిని పర్వతం కింద నలిపివేశాడు. అప్పుడు రావణుడు శివ స్తుతి గీతాలు ఆలపిస్తూ క్షమించమని వేడుకున్నాడు. రావణుడిపై శివుడు ఎంతగానో సంతోషించి, ప్రచండమైన ఉగ్రతతో, ఆవేశంతో నాట్యం చేయడం ప్రారంభించాడు. ఈ నాట్యాన్నే తాండవం అని, ఆ మంత్రాలనే శివ తాండవ స్తోత్రం అని పిలవడం మొదలుపెట్టారు. విద్యను అభ్యసించడానికి, రావణుడు నర్మదా నదీ తీరంలో శివుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఒక మహా తపస్సు చేశాడు . భగవంతుడిని ప్రసన్నం చేసుకోవాలనే కోరికతో, రావణుడు తన తలను వేరు చేశాడు. అతను అలా చేసిన ప్రతిసారీ, ఆ తల తిరిగి మొలిచేది. ఈ విధంగా పదిసార్లు జరగడంతో, అతను తన తపస్సును కొనసాగించగలిగాడు. అందువల్ల, శివుడు తాను త్యాగం చేసిన పది తలలను రావణుడికి ప్రసాదించాడు. ఈ పది తలల కారణంగానే అతన్ని 'దశముఖ' అని కూడా పిలుస్తారు. రావణుని పది శిరస్సులు ఆరు శాస్త్రాలకు (హిందూ మత పవిత్ర గ్రంథాలైన శ్రుతి, స్మృతి, పురాణ, తంత్ర అనే నాలుగు విభాగాలు), నాలుగు వేదాలకు ప్రతీకగా నిలుస్తాయి. వీటిలో రావణుడు ప్రావీణ్యం సంపాదించి, ఆ కాలంలోని గొప్ప పండితుడిగా, అత్యంత మేధావులలో ఒకడిగా నిలిచాడు. అతడు 64 రకాల జ్ఞానంలో, అన్ని ఆయుధ విద్యలలో నిష్ణాతుడు. ఆయన వేదాలను వాటికి సంబంధించిన సంగీత స్వరాలతో (నోట్లతో) సంకలనం చేసినట్లుగా ప్రసిద్ధి చెందాడు. రావణుడి పది తలలకు మరో వ్యాఖ్యానంగా పది భావోద్వేగాల్ని ఉటంకిస్తారు. ఆ భావోద్వేగాలు: కామం, క్రోధం, మోహం, లోభం, మదం, మాత్సర్యం, అసూయ, మనస్సు, బుద్ధి, చిత్, అహంకారం. ఒకప్పుడు, గొప్ప రాజు మహాబలి ఈ తొమ్మిది భావోద్వేగాలను విడిచిపెట్టి, కేవలం బుద్ధిని మాత్రమే కలిగి ఉండమని రావణుడికి సలహా ఇచ్చాడు. దానికి ఆయన, ఈ అన్ని అంశాలు సమానంగా ముఖ్యమైనవని, అవి ఒక వ్యక్తిని పరిపూర్ణ పురుషుడిగా చేస్తాయని సమర్థించుకున్నాడు. బుద్ధి అనే ఒక తల రావణునివిధిని నియంత్రించగా, ఆయనలోని ఇతర తలలు తన చర్యలను నియంత్రించాయి, ఇది చివరికి ఆయన వినాశనానికి దారితీసింది. రావణుడు చివరికి తన ఇంద్రియాలకు బానిస అయ్యాడు, తన కోరికలను నియంత్రించుకోలేక, తనను, తన వంశాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా, యావత్ లంకను బూడిదగా మార్చాడు. తన జీవితంలో తాను పొందిన జ్ఞానాన్ని ఆచరించనందుకు రావణుడు పశ్చాత్తాపపడ్డాడు, ఇది చివరికి రావణుని పతనానికి దారితీసింది.

- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)(ఇంటర్నెట్ కథనాల ఆధారంగా...)

Illustration : Yogesh Jadav

అధికారం, అంధకారం!

అహంకారానికి బలైన బ్రహ్మదేవుని భక్తుడు

హిందూ పురాణాలలో, మహిషాసురుని కథ ఒక ముఖ్యమైన, ప్రతీకాత్మకమైన గాథ, ముఖ్యంగా శాక్తేయంలో.

ఉపపురాణాల ప్రకారం, ఒకప్పుడు రాంభాసురుడు అనే ఒక అసురుడు ఉండేవాడు. అతను శివుడిని ప్రసన్నం చేసుకుని కుమారుడిని పొందడం కోసం అనేక యజ్ఞాలు చేశాడు. అతని ప్రయత్నాలకు సంతోషించిన శివుడు, రాంభాసురుడికి మూడు లోకాలలో అజేయుడు, ప్రసిద్ధి చెందిన కుమారుడిని కనే వరాన్ని ప్రసాదించాడు. అలా ఒక అసుర తండ్రికి, ఒక దున్నపోతు తల్లికి మహిషాసురుడు జన్మించాడు. మహిషాసురుడు శివుని దున్నపోతు అవతారం. అతను ఒక బలవంతుడైన అసురుడిగా, గొప్ప యోధుడిగా, పండితుడిగా ఎదిగాడు. అతని పాలనలో అసురులు వర్ధిల్లారు. మహిషాసురుడు బ్రహ్మదేవునికి గొప్ప భక్తుడు. సంవత్సరాల తపస్సు తర్వాత, బ్రహ్మదేవుడు చివరకు ప్రసన్నుడై అతనికి ఒక వరం ఇచ్చాడు. అధికారంపై మోజుతో, మహిషాసురుడు అమరత్వాన్ని కోరాడు. భూమిపై ఏ 'మనిషి లేదా జంతువు' చేత తాను చంపబడకూడదనేది అతని కోరిక. బ్రహ్మదేవుడు అతని కోరికను మన్నిస్తూ, వరమిచ్చాడు, కానీ ఒక స్త్రీ అతని పతనానికి కారణమవుతుందని చెప్పాడు. అహంకారంతో నిండిన మహిషాసురుడు, స్త్రీలు బలహీనులు, సున్నితమైనవారు, తనకంటే తక్కువవారని నమ్మాడు. అందువల్ల, తనకు హాని కలిగించగల స్త్రీ ఈ ప్రపంచంలో ఎవరూ లేరని అతను భావించాడు. బ్రహ్మదేవుడు మహిషాసురునికి అమరత్వ వరాన్ని ప్రసాదించిన తరువాత, అతను అధికార మదంతో స్వర్గ, నరక, భూలోకాలైన త్రిలోకాలపై దాడి చేశాడు. అతను ఇంద్రుని రాజ్యమైన ఇంద్రలోకాన్ని కూడా ఆక్రమించేంత వరకు వెళ్ళాడు.

మహిషాసురుడు దేవతలపై యుద్ధం చేశాడు, కానీ బ్రహ్మదేవుని వరం వల్ల ఎవరూ అతన్ని ఓడించలేకపోయారు. అందువల్ల దేవతలు సహాయం కోసం విష్ణుమూర్తిని ఆశ్రయించారు. చాలా ఆలోచనల తర్వాత, బ్రహ్మ, విష్ణు , శివుడు అనే త్రిమూర్తులు తమ శక్తులన్నింటినీ ఏకం చేసి, మహిషాసురుడిని ఓడించడానికి ఒక స్త్రీ రూపాన్ని సృష్టించాలని నిర్ణయించుకున్నారు. అలా పర్వతాధిపతి అయిన హిమవంతుని కుమార్తె, పార్వతీ దేవి అవతారమైన దుర్గాదేవి ఉద్భవించింది. దుర్గాదేవి 15 రోజుల పాటు మహిషాసురుడితో పోరాడింది. ఈ సమయంలో అతను వివిధ జంతువుల రూపంలోకి మారుతూ ఆమెను తప్పుదోవ పట్టించాడు. చివరకు అతను దున్నపోతుగా మారినప్పుడు, దుర్గాదేవి తన త్రిశూలంతో అతన్ని పొడిచింది, దాంతో అతని కథ ముగిసింది. మహాలయ రోజున మహిషాసురుడు ఓడిపోయి హతమయ్యాడు.

ఈ గాథకు సంబంధించిన మరో కథనం ప్రకారం, మహిషాసురుడు ఒకసారి తన స్వప్నంలోనే తన మరణానికి కారణం కాబోతున్న దేవిని చూశాడు. ఆ తర్వాత అతను 16 చేతుల భద్రకాళిని పూజించాడు. ప్రసన్నమైన ఆ దేవి మహిషాసురుడి ముందు ప్రత్యక్షమవ్వగా, ఆ కల ద్వారా తన అంతం సమీపించిందని గ్రహించానని అతను ఆమెతో చెప్పాడు. అందుకే, తనను సంహరించి మోక్షాన్ని ప్రసాదించమని అతను ఆ దేవిని కోరాడు. ఆ దేవి అతన్ని ఆశీర్వదించి, తాను అతనికి భౌతిక శరీరం నుండి విముక్తి కలిగించిన తర్వాత, అతను భూమిపై పునర్జన్మ ఎత్తడని, తనలో లీనమవుతాడని చెప్పింది. ఇది అసురుడిగా అతని మూడవ జన్మ అని కూడా దేవి మహిషాసురుడికి తెలియజేసింది. గత కల్పాలలో, ఆమె ఉగ్రచండ, భద్రకాళి రూపంలో అతన్ని సంహరించింది. తన కలలో, గత కల్పంలో తనను సంహరించిన అదే భద్రకాళిని అతను చూశాడు. అందువల్ల, దేవి తన మహిషాసుర మర్దిని రూపంలో, తనకు పూజ జరిగినప్పుడల్లా మహిషాసురుడు ఎల్లప్పుడూ తన ఎడమ పాదం కింద ఉంటాడని, పూజకు అర్హుడని చెప్పింది. దేవి వాహనమైన సింహ రూపంలో ఆమె బరువులో సగభాగాన్ని మోయవలసి వచ్చిన విష్ణుమూర్తికి విముక్తి కలిగించడానికి మహిషాసురుడు జన్మించాడు. అందువల్ల, దేవి తన ఎడమ పాదాన్ని మహిషాసురునిపై, కుడి పాదాన్ని శ్రీహరి రూపమైన సింహంపై ఉంచుతుంది.



మరో కథ ప్రకారం, మహిషాసురుడి గాథ దాదాపు 3000 సంవత్సరాల క్రితం నాటిది. ఆ కాలంలో మహిషాసురుడు ఆర్యుడు కాని రాజు, అతని ప్రజలు మహిషాన్ని పూజించేవారు. ఆర్యావర్త ఉత్తర రాజ్యంలో అనేక ఆర్య రాజులను ఓడించడంతో మహిషాసురుడి శక్తికి హద్దులు లేవు. మహిషాసురుడి చేతిలో చాలా మంది రాజులు ఓడిపోతుండగా, ఆర్యావర్త ఉత్తర భాగాన్ని పాలించడానికి ఒక రాణి వచ్చింది. అప్పటికే ఆ మహారాజు చేతిలో ఓడిపోయిన రాజులు ఆ రాణికి తమ విధేయతను ప్రకటించారు. ఆమె సైన్యం బలంలోనూ, సంఖ్యలోనూ వృద్ధి చెందుతుండగా, మహిషాసురుడికి సరఫరాలు, సైనిక శక్తి తగ్గిపోసాగాయి. ఒక స్త్రీ చేతిలో తాను ఓడిపోలేనని భావించి, తన భార్యగా మారమని రాణి వద్దకు దూతలను పంపాడు. రాణి నిరాకరిస్తూనే ఉంది. ఇంతలో, మహిషాసురుడి సైన్యం రాణి సైన్యం నుండి తమను తాము రక్షించుకోలేనంతగా అలసిపోయినప్పుడు, ఆ రాణి మహిషరాజుపై దాడికి ప్రణాళిక వేసింది. మహిషాసురుడు తానే రాణిని ఓడించగలనని అనుకున్నాడు, కానీ ఆమె తన ఈటెతో అతడిని చంపి, అతని ఛాతీని చీల్చి, తన పెంపుడు సింహానికి ఆహారంగా వేసింది.

- కల్కి

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.